కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :171 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | బుధవారం 28-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

ఈటల రాజేందర్ పాదయాత్రకు బ్రేక్..

హైదరాబాద్,ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్‌లో ప్రారంభానికి ముందే ఉద్రిక్తతఎంపీగా తన నియోజకవర్గంలో పర్యటించే హక్కు ఉందన్న ఈటలగతంలో ఇదే అంశాన్ని సీఎం రేవంత్ ప్రస్తావించారని గుర్తు చేసిన బీజేపీ ఎంపీమల్కాజ్‌గిరి ఎంపీ, భారతీయ జనతా పార్టీ నేత ఈటల రాజేందర్ తలపెట్టిన "మహా పాదయాత్ర"కు పోలీసులు అనుమతి నిరాకరించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈరోజు ఉదయం ఈ యాత్ర ప్రారంభం కావాల్సి ఉండగా, చివరి నిమిషంలో పోలీసులు అనుమతి నిరాకరించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ నుంచి నాలుగు రోజుల పాటు ఈ పాదయాత్ర జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా ఈటల రాజేందర్ ఉదయాన్నే ఏదులాబాద్ చేరుకుని, స్థానిక రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 5,000 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి యాత్రను ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా, పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. పోలీసుల చర్యపై ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకునే హక్కు తనకుందని ఆయన స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌కు లేఖ రాసి అనుమతి కోరినట్లు



వెల్లడించారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఇదే జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై పార్లమెంటులో మాట్లాడారని ఈటల గుర్తుచేశారు. నాడు రేవంత్ రెడ్డి లేవనెత్తిన అంశంపైనే ఇప్పుడు తాను పాదయాత్ర చేస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. పోలీసుల అనుమతి నిరాకరణ నేపథ్యంలో పాదయాత్ర ముందుకు సాగుతుందా? లేదా? అనే దానిపై అనిశ్చితి నెలకొంది. ఈ క్రమంలో ఏదులాబాద్‌లో ప్రస్తుతం ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

ఢిల్లీ ర్యాలీ.. టీ కాంగ్రెస్‌కు రైల్వే శాఖ షాక్.. కాంగ్రెస్ ప్లాన్ బి ఇదే!



హైదరాబాద్, 'ఓట్ బచావో – దేశ్ బచావో' నినాదంతో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి నవంబర్ 1న న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ నిరసన సభకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా దాదాపు 10 లక్షల మందిని సమీకరించాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో, ఏఐసీసీఆదేశాల మేరకు రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులను ఢిల్లీకి తరలించేందుకు టీపీసీసీ ఏర్పాట్లు వేగవంతం చేసింది. ఈ క్రమంలో రాష్ట్రం నుంచి కార్యకర్తలను, నేతలను ఢిల్లీకి చేర్చేందుకు వీలుగా 3 ప్రత్యేక రైళ్లను కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థపై రైల్వే శాఖ బిగ్ షాక్ ఇచ్చింది. ప్రత్యేక రైళ్ల కేటాయింపునకు రైల్వే శాఖ అనుమతి నిరాకరించింది. ఓ వైపు పెద్ద సంఖ్యలో శ్రేణులను తరలించేందుకు క్షేత్రస్థాయిలో నాయకులు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో రైల్వే అధికారులు స్పెషల్ ట్రైన్స్ నిరాకరించడంతో జనసమీకరణ ఎలా అనేది సస్పెన్స్‌గా మారింది.

100కు పైగా బస్సులు రెడీ:

రైల్వే శాఖ నుంచి ఇబ్బందులు ఎదురైనప్పటికీ ఢిల్లీ సభకు వెళ్లడం ఆగదని కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. ఎలాగైనా ఢిల్లీ సభను సక్సెస్ చేయాలని చూస్తున్న టీపీసీసీ ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించి. ఒకవేళ రైళ్లకు ఆఖరి నిమిషం వరకు అనుమతి లభించకపోతే ప్రత్యామ్నాయంగా ప్రత్యేక బస్సుల ద్వారా కార్యకర్తలను ఢిల్లీకి తరలించాలని పీసీసీ నిర్ణయించింది. రైల్వే శాఖ నుంచి స్పష్టత లేకపోవడంతో ఇప్పటికే 100 బస్సులను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ బస్సుల ద్వారా 30వ తేదీనే పార్టీ శ్రేణులను ఢిల్లీకి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

హైదరాబాద్‌లో మయన్మార్ మహిళపై అఘాయిత్యం..



హైదరాబాద్: హైదరాబాద్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. మయన్మార్‌కు చెందిన మహిళపై ఆమె భర్తతో పాటు మరో ముగ్గురు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కంచన్‌బాగ్ పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. మయన్మార్‌కు చెందిన మహిళను బంగ్లాదేశ్‌కు చెందిన ఫయజ్ అనే వ్యక్తి వివాహం చేసుకున్నాడు. అనంతరం వీరిద్దరూ హైదరాబాద్‌కు వచ్చి కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసైన ఫయజ్.. తన స్నేహితులతో లైంగిక సంబంధాలు పెట్టుకోవాలంటూ భార్యపై ఒత్తిడి తెచ్చాడు. ఈ క్రమంలోనే ఆమెపై భర్తతో పాటు మరో ముగ్గురు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితురాలు కంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో భర్త ఫయజ్‌తో పాటు మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

5 లక్షల మందితో నిరసనకు దిగితే వ్యాపారాలు ఎలా చేసుకోవాలి..



సీజన్‌లో ర్యాలీ నిర్వహించడంవల్ల రామ్‌లీలా మైదానం పరిసరాల్లో దాదాపు రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడవచ్చని పేర్కొన్నది.

న్యూఢిల్లీ, సీఈసీ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ నవంబర్ 1న మెగా ర్యాలీ కి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అయితే దీపావళి పండగ వేళ ఈ ఆందోళన కారణంగా తాము నష్టపోతామని, ర్యాలీని వాయిదా వేసుకోవాలని దేశ రాజధానిలోని వ్యాపార సంఘాలు అభ్యర్థించాయి. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కి లేఖ రాశాయి.దీనిపై కాంగ్రెస్ పార్టీగానీ, రాహుల్‌గాంధీగానీ సానుకూలంగా స్పందించకపోవడంతో 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (జు×)' మరోసారి లేఖ రాసింది. పది లక్షల మంది నిరసనకారులు ఢిల్లీకి వస్తే వ్యాపారం ఎలా చేసుకోవాలని ప్రశ్నించింది. దీపావళి పండగ

ఏపీ తెలంగాణాలపై ఫోకస్...మోడీ అమిత్ షా టూర్లు !

హైదరాబాద్,దక్షిణాదిన బీజేపీకి పూర్తి స్థాయిలో ఆశలు ఉన్నవి రెండు తెలుగు రాష్ట్రాలే అన్నది తెలిసిదే. తమిళనాడు టీవీకే అన్న కొత్త పార్టీని గెలిపించింది. అలా విజయ్ ముఖ్యమంత్రి అయ్యారు. కేరళలో కమ్యూనిస్టులు దిగిపోతే కాంగ్రెస్ అధికారం అందుకుంది. కర్ణాటకలో టఫ్ ఫైట్ కాంగ్రెస్ బీజేపీల మధ్య ఉంది. ఈ నేపధ్యంలో 2029 ఎన్నికల గురించి ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్న బీజేపీ పెద్దలు ఏపీ తెలంగాణాల్లో వరస టూర్లకు ప్లాన్ చేశారు అని అంటున్నారు.

తెలంగాణా వ్యూహం :

ఇదిలా ఉంటే కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న తెలంగాణలో పర్యటిస్తారు. ఇక ప్రధాని నరేంద్ర మోడీ డిసెంబర్ నెలలో తెలంగాణలో టూర్ పెట్టుకున్నారు. నవంబర్ 2న హైదరాబాద్‌లో జరిగే బీజేపీ మహా పాదయాత్రలో అమిత్ షా పాల్గొంటారు. పోలింగ్ బూత్ కమిటీల సమావేశాలు సంస్థాగత సమీక్షలలో కూడా ఆయన హాజరవుతారు. నరేంద్ర మోదీ డిసెంబర్ లో వరంగల్‌లో మామునూరు విమానాశ్రయం శంకుస్థాపన కోసం వస్తున్నారు. అలాగే సమ్మక్క సారక్క ట్రైబల్ యూనివర్సిటీ కాజీపేట వ్యాగన్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవాలు చేయడమే కాకుండా వరంగల్ లోనే భారీ బహిరంగ సభలో పాల్గొంటారు.

ఏపీలో సైతం ఇద్దరూ :

ఇదే నేపధ్యంలో ఏపీలో కూడా అధికారిక కార్యక్రమాలలో మోడీ అమిత్ షా పాల్గొంటారు. డిసెంబర్ 4 నుంచి 6వ తేదీల దాకా తిరుపతిలో డిజిపిలు,ఐజిపిల సమావేశంలో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా హాజరవుతారు. తిరుపతిలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ లో డిజిపిలు,ఐజిపిల జాతీయ స్థాయి సమావేశం జరగనుంది .వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన డిజిపిలు,ఐజిపిలు సహా 200 మందికి



పైగా ఐపిఎస్ అధికారులు, 200 మంది వరకూ ఐబి అధికారులు,స్టేట్ అండ్ సెంట్రల్ ఫోర్సెన్సెస్ అధికారులు,ఎన్ఎస్ఏ,కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గోనున్నారు. ఇక ప్రధాన మంత్రి నరేంద్ర మోడి మొదటి రెండు రోజులు ఈ సమావేశాల్లో పాల్గొనే అవకాశం ఉంది. దాని కోసం ఇప్పటి నుంచే కసరత్తు సాగుతోంది.

తెలుగు నాట పట్టు కోసం :

అలా డిసెంబర్ నెలలో మోడీ అమిత్ షా రెండు తెలుగు రాష్ట్రాలలో పర్యటిస్తారు. దాంతో ఏపీ తెలంగాణా రాజకీయం గురించి కూడా చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.అలాగే తెలంగాణాలో వచ్చే ఎన్నికల్లో అధికారం అందుకోవాలని బీజేపీ పట్టుదలగా ఉంది. ఏపీలో తన రాజకీయ బలాన్ని పెంచుకోవాలని చూస్తోంది.దీంతో మోడీ అమిత్ షా పర్యటనలు ఆసక్తిని రేపుతున్నాయి.

మహిళలకు గుడ్ న్యూస్.. ఇందిరమ్మ కుట్టు మిషన్ల స్కీమ్‌పై మంత్రి పొన్నం కీలక అప్‌డేట్!



హైదరాబాద్,తెలంగాణలో బీసీ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా సంక్షేమ శాఖ పథకాల్లో పారదర్శకతను పెంచాలని, వేగంగా అమలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు తాజాగా జరిగిన సమీక్షా సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా మహిళలకు స్వయం ఉపాధి కల్పన, గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

కుట్టు మిషన్ల పంపిణీ

బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్లు' పథకానికి అపూర్వ స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.80 లక్షల దరఖాస్తులు రాగా, తొలి విడతగా ప్రతి నియోజకవర్గానికి 1,000 మంది చొప్పున మొత్తం 1.90 లక్షల మందికి లబ్ధి చేకూర్చాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 9న లబ్ధిదారులకు నేరుగా కుట్టు మిషన్లు అందించేలా పకడ్బందీ కార్యాచరణ రూపొందించాలని, టెండర్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

301 ప్రైవేట్ గురుకులాలకు శాశ్వత పరిష్కారం!

రాష్ట్రంలోని 327 మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల పాఠశాలల పరిస్థితిపై ఆయా రీజనల్ కోఆర్డినేటర్లు అందించిన నివేదికలపై మంత్రి సమీక్ష జరిపారు. ప్రస్తుతం ఉన్న 327 గురుకులాల్లో కేవలం 26 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా, మిగిలిన 301 పాఠశాలలు ప్రైవేట్ అద్దె భవనాల్లో కొనసాగుతుండటం గమనార్హం. అయితే, ఇప్పటికే 37 గురుకులాలకు సొంత స్థలాలు అందుబాటులో ఉన్నందున, అక్కడ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మరియు అనుమతులు మంజూరు చేసేలా ప్రభుత్వంతో చర్చిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

స్టడీ సర్కిళ్లపై ప్రత్యేక నిఘా

ఎన్నికల హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న 38 బీసీ ఆత్మగౌరవ భవనాల జీవోల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. అలాగే, రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చిన దరఖాస్తుల్లో బీసీ యువతకు తగిన ప్రాధాన్యత దక్కేలా చూస్తామన్నారు. మరోవైపు, బీసీ స్టడీ సర్కిళ్లలో నాణ్యమైన శిక్షణ కోసం కమిటీ నివేదిక ఆధారంగా నూతన సంస్కరణలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల్లో ఎలాంటి జాప్యం జరగకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా యంత్రాంగం పనిచేయాలని ఆయన తేల్చిచెప్పారు.

పోసానిపేట్‌లో మహిళా సమాఖ్య భవనం ప్రారంభం



సదాశివనగర్ (రామారెడ్డి): మహిళా స్వయం సహాయక సంఘాల విజ్ఞప్తికి స్పందించి, ఇచ్చిన హామీని నెరవేర్చిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుపై మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన మహిళా సమాఖ్య భవనాన్ని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కలిసి ప్రారంభించారు.

మహిళల విజ్ఞప్తికి ఎమ్మెల్యే సానుకూల స్పందన

గతంలో పోసానిపేట్ గ్రామానికి చెందిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ సంఘ కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి ప్రత్యేక భవనం అవసరమని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావును కలిసి విజ్ఞప్తి చేశారు. మహిళా సంఘాల అవసరాన్ని గుర్తించిన ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ. 10 లక్షల నిధులతో భవన నిర్మాణం పూర్తికావడంతో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నూతన భవనాన్ని ప్రారంభించారు.

మంత్రి, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

గ్రామానికి విచ్చేసిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని, ఇచ్చిన మాట ప్రకారం మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యేకు మహిళా సంఘాల సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా సంఘాల కార్యకలాపాలకు మరింత తోడ్పాటు

నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనం మహిళా సంఘాల సభ్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. సంఘ సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు పొదుపు కార్యకలాపాలు చేపట్టడానికి, మహిళా సంఘాల ద్వారా అమలయ్యే వివిధ కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగించడానికి ఈ భవనం దోహదపడనుంది. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ, స్వయం సమృద్ధి సాధించడంలో స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

తెలంగాణ రేషన్ కార్డుదారులకు గుడ్ న్యూస్..

హైదరాబాద్, ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు కీలక సన్నాహాలు చేస్తోంది. వర్షాభావం వల్ల పంటల దిగుబడి తగ్గి నరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యుల ఇంటి బడ్జెట్ తలకిందులవుతోంది. ఈ పరిస్థితుల నుంచి పేద, మధ్యతరగతి ప్రజలను గట్టెక్కించేందుకు రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు, గోధుమ పిండి, పంచదార, పామాయిల్, చింతప ండు, కారంపొడి వంటి నిత్యావసర సరుకులను అతి తక్కువ సబ్సిడీ ధరలకే పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ సమగ్ర కార్యాచరణ రూపొందిస్తోంది.

14 నెలల ఆహార భద్రతే లక్ష్యం..

పౌరసరఫరాల సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు:

ఇటీవల హైదరాబాద్‌లోని సచివాలయంలో పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో రాష్ట్ర రవాణా, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ పంపిణీ కార్యక్రమంపై కీలక ఆదేశాలు జారీ చేశారు.



సంపాదకీయం

బుధవారం 28-10-2026

వృద్ధిలో ముందడుగు ఉపాధిలో వెనకడుగు

రాజకీయ స్థిరత్వం, బలమైన మూలధన నిల్వల వల్ల భారతదేశ జీడీపీ అధిక వృద్ధిరేటు సాధిస్తోంది. కానీ, ఈ పురోగతి ఉద్యోగావకాశాల కల్పనకు దారితీయడంలేదు. నిజానికి నిరుద్యోగిత పెరుగుతోంది. దేశంలో మొదటి నుంచీ గ్రామీణ నిరుద్యోగిత, సీజన్లవారీ నిరుద్యోగిత ఎక్కువ. ఇప్పుడది మరింత సంక్లిష్టంగా మారుతోంది. దేశార్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలు, సాంకేతికత, విద్య, నైపుణ్య అవసరాల్లో వచ్చిన మార్పులు ఉపాధి కల్పనపై ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా నిరుద్యోగ సమస్య పైకి కనిపించేదానికన్నా చాలా ఎక్కువగా ఉంటోంది.జాతీయ నమూనా సర్వే నివేదికల ప్రకారం 1990, 2000 దశకాల్లో దేశంలో నిరుద్యోగిత రేటు రెండు మూడు శాతంగా ఉండేది. కొత్త నియతకాల కార్మికశక్తి సర్వే(పీఎల్ఎఫ్ఎస్) ప్రకారం, ఈ రేటు 2017-18 నాటికి ఆరు శాతానికి పెరిగింది. తర్వాత 2018-19లో నిరుద్యోగం 5.8శాతానికి తగ్గి, 2025 నాటికి 3.1శాతానికి చేరుకుందని సర్వే వెల్లడించింది. మరోవైపు, 15-29 ఏళ్ల యువతలో సగటు నిరుద్యోగిత రేటు 2024లో 10.3శాతం కాగా, నిరుడు 9.9శాతానికి తగ్గింది. అదే కాలంలో పట్టణ నిరుద్యోగిత రేటు 13.6శాతంగా ఉంటే,గ్రామీణ ప్రాంతాల్లో 8.3శాతంగా లెక్క తేలింది.

వాస్తవ నిరుద్యోగిత ఇంకా ఎక్కువ?

ఇక్కడ అత్యంత ఆందోళనకర అంశం ఏమిటంటే- పట్టభద్రుల్లో నిరుద్యోగుల సంఖ్య నిరంతరం ఎక్కువగా ఉండటం. పీఎల్ఎఫ్ఎస్ డేటా ప్రకారం, పట్టభద్రుల్లో నిరుద్యోగిత 2019-20లో 17.2 శాతంగా ఉండి, 2023-24 నాటికి 13శాతానికి తగ్గింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ అంచనా ప్రకారం, 2022లో సుమారు 29.1శాతం మంది యువగ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా తేలారు. మహిళా గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగిత రేటు 34.5శాతమైతే, పురుష పట్టభద్రుల్లో అది 26.4శాతం. తమ నైపుణ్యాలూ, విద్యార్హతలకు తగని కొలువులు చేస్తూ తక్కువ జీతంతో నెట్టుకొస్తున్నవారు నిరుద్యోగులుగా లెక్కకు రావడం లేదు. వీరిని కూడా పరిగణనలోకి తీసుకుంటే, అసలైన నిరుద్యోగిత రేటు అధికార లెక్కల్లో మూపేదానికన్నా ఎక్కువని తేలుతుంది. ఈ విధంగా ఇండియాకు ఉన్న యువజనాధిక్య ప్రయోజనం దక్కకుండా పోతోంది. ఆర్థిక వృద్ధిని స్థిరంగా కొనసాగించడానికి పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను యువతకు నేర్పడం, ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచడం, ఉపాధి అవకాశాలను కల్పించడం ఎంతో అవసరం.ఉన్నత విద్యలో నమోదైన విద్యార్థుల సంఖ్య 2014-15లో 3.42 కోట్లు కాగా, 2023-24లో అది 4.5 కోట్లకు చేరింది. వీరందరికీ నైపుణ్యాలను మప్పి, ఉపాధి కల్పించడం పెద్ద సవాలుగా మారింది. ఏఐ విశ్వవ్యాప్తమవుతున్న నేపథ్యంలో, పరిశ్రమలు డిమాండ్ చేస్తున్న నైపుణ్యాలను పట్టభద్రులు నేర్చుకోవాలి. యువ గ్రాడ్యుయేట్ల ఉపాధికి కీలకమైన ఐటీ రంగం ఇటీవలి కాలంలో తీవ్ర ఒత్తిడికి గురవుతోంది. ఆటోమేషన్, ఏఐ, పారిశ్రామిక అవసరాల వల్ల ప్రవేశస్థాయి ఉద్యోగాలు కుంచించుకుపోతున్నాయి. క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు, మాస్ రిక్రూట్‌మెంట్లు తగ్గాయి. ఏఐ, క్లౌడ్ ఆధునికీకరణ, మౌలిక వసతుల వృద్ధివల్ల అత్యంత ప్రత్యేకమైన, సామర్థ్య-ఆధారిత నియామకాలు పెరుగుతున్నాయి. అయితే, ఇన్ని సవాళ్ల మధ్య కూడా ఇండియాలో సుమారు 60లక్షల మంది టెక్ నిపుణులు ఐటీ రంగంలో ఉపాధి పొందుతున్నారు. నిరుడు ఈ రంగం కొత్తగా 1.35లక్షల ఉద్యోగాలను జోడించింది. మరోవైపు, దేశంలోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు(జీసీసీలు) 19లక్షలకు పైగా నిపుణులకు ఉపాధి కల్పిస్తున్నాయి. రాబోయే సంవత్సరాల్లో వీటి సంఖ్య ఇంకా పెరగవచ్చు. ఐటీయేతర రంగాల్లో విద్యావంతులైన యువతకు తగినన్ని ఉద్యోగాలు, చక్కని ఆదాయాన్నిచ్చే కొలువులను సృష్టించడంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. తగినంత ఆదాయం లేక కొందరు విద్యావంతులు నిరుద్యోగులుగానే ఉండిపోతున్నారు. లేదంటే, తక్కువ వేతనాలిచ్చే ఉద్యోగాలు చేయడమో, స్వయం ఉపాధికి మళ్లడమో చేస్తున్నారు. దీన్ని మార్చడానికి విద్యాసంస్థలు ఏఐ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందించడంపైనా; పారిశ్రామిక ప్రాజెక్టులూ, ఇంటర్న్‌షిప్‌ల ద్వారా పని-ఆధారిత అభ్యాస అవకాశాలను విస్తరించడంపైనా దృష్టి పెట్టాలి. ఇందుకు విద్యాసంస్థలు పరిశ్రమతో సన్నిహిత సహకారాన్ని ఏర్పాటు చేసుకోవాలి. యువ గ్రాడ్యుయేట్లకు తగిన నైపుణ్యాలను మప్పడంలో పరిశ్రమ చురుగ్గా వ్యవహరించాలి. వృత్తిలో పురోగతి, అధిక వేతనాలు, నిరంతర అభ్యాస అవకాశాలను అందించగల ఉద్యోగాల సృష్టికి అనువైన విధానాలను ప్రభుత్వాలు చేపట్టాలి.యువతలో నిరుద్యోగం, పాక్షిక నిరుద్యోగం పెరగడానికి కారణం- కార్మిక మార్కెట్ వ్యవసాయం నుంచి పారిశ్రామిక ఉపాధికి ఎదగకపోవడమే. భారత్ పారిశ్రామిక రంగాన్ని పూర్తిగా దాటవేసి, నేరుగా సేవా రంగంలోని ఉద్యోగాలకు మళ్లింది. దీనివల్ల లక్షలాది మంది సామాన్యులు క్యాజువల్ లేబర్‌గానే మిగిలిపోయారు. సరికదా, వీరిని నియమించుకోవడానికి తగినన్ని పరిశ్రమలు లేవు.

పెట్టుబడులు పెరిగితే తప్ప...

దేశంలో మూలధన సంచయం గణనీయంగా పెరిగింది. ఒక దేశంలో భవనాలు, యంత్రాలు, రోడ్లు, విద్యుత్కేంద్రాల వంటి స్థిరాస్తులపై వెచ్చించిన మొత్తం పెట్టుబడిని మూలధన సంచయం అంటారు. కొవిడ్‌కు ముందు జీడీపీలో 28.6శాతంగా ఉన్న ఈ మదుపు నిరుడు 34.3 శాతానికి పెరిగింది. అయినాసరే, ఉత్పాదక ఆస్తుల్లో పెరిగిన పెట్టుబడులు తగినన్ని ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని చెప్పలేం. శ్రమతో కూడుకున్న రంగాల్లో పెట్టుబడులు పెరిగితే తప్ప, ఉపాధిలో దామాషా పెరుగుదలను ఆశించలేం.ఏదిఏమైనా, ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను యువతకు నేర్పాలని ఇండియా స్కిల్స్ రిపోర్ట్-2026 సిఫార్సు చేసింది. యువతలో ఉద్యోగార్హనైపుణ్యాలు 54.81శాతం నుంచి 56.35 శాతానికి పెరిగినట్లు తెలిపింది. ఏఐ, డిజిటల్, గిగ్‌వర్క్, ఫ్రీలాన్సింగ్, రిమోట్ వర్క్ నైపుణ్యాలను యువత నేర్చుకోవడం వల్లే ఇది సాధ్యమైంది. అందువల్ల మనం డిగ్రీ-కేంద్రిత విద్యావ్యవస్థ నుంచి ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను నేర్పే వ్యవస్థకు మారాలి. పట్టభద్రుల్లో ఉపాధి సామర్థ్యాన్ని పెంచడానికి పరిశ్రమ, విద్యాసంస్థలు అనుభవపూర్వక అభ్యాసాలను చేపట్టాలి. యువత కూడా తమ ఉద్యోగార్హతను మెరుగుపరచుకోవడానికి సృజనాత్మకతనూ, విమర్శనాత్మక ఆలోచనా విధానాన్నీ, పరిస్థితులకు అనుగుణంగా మారడం వంటి సుగుణాలను అలవర్చుకోవాలి.

మహిళా సంఘాల భవన నిర్మాణంలో నాణ్యత ఏదీ?



కొత్తగూడ,మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం సహాయక సంఘాల ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్న ప్రభుత్వ లక్ష్యానికి క్షేత్రస్థాయిలో చేపడుతున్న నిర్మాణ పనులు విఘాతం కలిగిస్తున్నాయా? అనే ప్రశ్నలు ప్రజల్లో క్షులుగుతున్నాయి, దీనికి తార్కణం గా మహిళా సంఘాల కార్యకలాపాలకు ఎంతో కీలకమైన వీవో భవనాల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. కొత్తగూడ మండలం బత్తలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న వీవో భవన పనులపై స్థానికంగా పలు ఆరోపణలు వినవస్తున్నాయి

మహిళా సంఘాలకు వీవో భవనాలు ఎంతో కీలకం

గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థికాభివృద్ధికి స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మహిళలు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం, చిన్నతరహా వ్యాపారాలు ప్రారంభించడం, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడం వంటి కార్యక్రమాల్లో ఈ సంఘాలు ముఖ్యమైన వేదికలుగా నిలుస్తున్నాయి.గ్రామ సమాఖ్యలు, వీవో (విలేజ్ ఆర్గనైజేషన్) మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించుకోవడానికి, పొదుపు--రుణ లావాదేవీలపై చర్చించడానికి, ప్రభుత్వ పథకాలపై అవగాహన పొందడానికి, మహిళల సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించడానికి ప్రత్యేక భవనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.ఆ దిశ గా యోచన చేసిన రాష్ట్ర ప్రభుత్వం మంత్రి సీతక్క చొరవతో కొత్తగూడ మండలం లోని 24 గ్రామ పంచాయితీ లకు వి ఓ భవనాలను మంజూరు చేసింది.ఈ భవన నిర్మాణల ఉద్దేశం గ్రామం లోని పొదుపు సంఘాల చిట్టా పద్దుల నిర్వహణ తో పాటు వారి స్వయం ఉపాధి పధకల గురించిన సమావేశాల నిర్వహణ కొరకు ఒక సమావేశపు మందిరం ఉండాలానే తలంపుతో వి ఓ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది ఈ భవనాల్లో మహిళా సంఘాల రికార్డుల నిర్వహణ, శిక్షణ కార్యక్రమాలు, జీవనోపాధి ప్రణాళికల రూపకల్పనకు తోడ్పడతాయి అనే ఉద్దేశం తో ప్రభుత్వం ప్రత్యేకం గా మంత్రి సీతక్క, ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకం గా తీసుకుంది. ఇలాంటి ప్రాధాన్యత కలిగిన భవనాల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా, పనుల తీరుపై ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది.

నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా?

బత్తలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న వీవో భవన పనుల్లో గోదావరి ఇసుకకు బదులుగా క్వారీ (కంకర) డస్ట్ వినియోగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణ సామగ్రి నాణ్యత, పనుల ప్రమాణాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలన జరపాల్సిన అవసరం ఉండగా అందుకు విరుద్ధం గా గూట్టేదారు ఇష్టా రాజ్యంగా కంకర డస్ట్ తో పునాదుల స్థాయినుంచే ఇసుకకు బదులుగా కంకర డస్ట్ తో వి ఓ భవనాన్ని నిర్మిస్తుండడం తో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 10 లక్షల రూపాయల ప్రజాధనం తో నిర్మిస్తున్న ఈ వి ఓ భవనం ఎంత కాలం మన్నుతుందనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారుభవన నిర్మాణంలో ఉపయోగించే ఇసుక, ఇతర సామగ్రి నాణ్యతను సంబంధిత సాంకేతిక ప్రమాణాల ప్రకారం పరిశీలించాలి. కానీ బత్తుల పల్లి వి. ఓ భవన నిర్మాణ పనుల్లో సంబంధిత శాఖ అధికారి పర్యవేక్షణ లేకుండానే ఈ పనులు జరగడం ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు భవన నిర్మాణం అంచనాలు, నిబంధనలు, ఇంజినీరింగ్ అధికారుల సూచనలకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయా లేదా అనేది క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారి స్వయం గా పరిశీలించి మార్పులు చేర్పులు ఉంటే గుత్తేదారు తో భవనాన్ని ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం నిర్మింప చేయాలిసిన బాధ్యత సదరు అధికారిపై ఉంది అది దీర్ఘకాలం మహిళా సంఘాలకు ఉపయోగపడేలా నాణ్యతతో

కేసీఆర్ అలిగిండా..?

హైదరాబాద్,తెలంగాణ బాపు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అలిగిండా..? రాష్ట్ర ప్రజలు మూడోసారి ముఖ్యమంత్రిని చేయలేదని ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారా..? ప్రజా సమస్యలపై గొంతెత్తాల్సిన ప్రతిపక్ష నేత మౌనంగా ఉండడం వెనుక అసలు కారణమేంటి..? ఇలాంటి ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. స్వరాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్, అధికారం కోల్పోయిన తర్వాత తెలంగాణ ప్రజలకు ఎందుకు దూరంగా ఉంటున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కేసీఆర్ ఒక మాట బలంగా చెప్పారు. ప్రజలు గెలిపిస్తే మూడోసారి అధికారంలోకి వచ్చి పాలన చేస్తానని, లేదంటే ఫామ్‌హౌస్‌లో ఉండి రెస్ట్ తీసుకుంటానని పేర్కొన్నారు. అయితే, మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోవడంతో కేసీఆర్ అన్నట్లుగానే ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు.

ప్రజలు ఓడిస్తే.. వారిపై ఇంత కోపమా.?

2024 మే నెలలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ తిరిగి ప్రజల్లోకి వచ్చారు. ఆ సమయంలో ప్రజలు చేసుకున్న కర్మను వారే అనుభవించాలన్న ధోరణిలో ఆయన చేసిన వ్యాఖ్యలు తెలంగాణ సమాజంలో విస్తృత చర్చకు దారితీశాయి. తమను ఓడించిన ప్రజలే తమ నిర్ణయానికి ఫలితాలను అనుభవించాలన్న భావన ఆయన మాటల్లో కనిపించిందని రాజకీయ విమర్శకులు అభిప్రాయపడ్డారు. కేసీఆర్ ఒక్కరే కాదు.. కేటీఆర్ కూడా పలు సందర్భాల్లో బీఆర్ఎస్‌ను ఓడించి ప్రజలు తప్పు చేశారని అహంకార ధోరణితో మాట్లాడిన విషయం అందరికీ తెలిసిందే. కానీ, బీఆర్ఎస్ పాలనలో జరిగిన తప్పిదాలను సమీక్షించుకోవాల్సింది పోయి, తమకు ఓటు వేయని ప్రజలనే తప్పుబట్టారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజం. ప్రజలు ఒకసారి గెలిపించినంత మాత్రాన జీవితాంతం అధికారంలో కొనసాగించాలని కోరుకోవడం పొరపాటు. ప్రజల తీర్పును గౌరవించి, తమ ఓటమికి కారణాలను విశ్లేషించుకోవాల్సింది పోయి, అడ్డగోలుగా మాట్లాడి వారి నైజాన్ని పదే పదే నిరూపించుకున్నారు.

కుటుంబం కోసం బయటకు.. ప్రజల కోసం ఎప్పుడు?

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమవుతున్నారనే విమర్శలకు మరో కోణం కూడా ఉంది. మూడేళ్ల కాలంలో కేసీఆర్ ఫామ్ హౌస్ నుండి బయటికి వచ్చింది చాలా తక్కువ. పార్లమెంట్ ఎన్నికల సమయంలో, తెలంగాణ భవన్ లో పార్టీ మీటింగ్ సమయంలో వచ్చారు. ఇక తన మనవడు హిమాన్ష చిన్నగాయంతో హాస్పిటల్‌లో చేరినప్పుడు కేసీఆర్ ఫాంహౌస్ నుండి బయటికి వచ్చారు. ఇక ఆయన బావమరిది శ్రీనివాసరావు చనిపోగా వెళ్లి పరామర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి హార్ట్ స్ట్రోక్తో ఆస్పత్రిలో చేరినప్పుడు, చనిపోయిన తర్వాత పెద్ది కుటుంబ సభ్యులను పరామర్శించడానికి బయటికొచ్చారు. తప్పితే.. ఫామ్ హౌస్ నుండి కేసీఆర్ బయటికి వచ్చిన సందర్భాలు పెద్దగా లేవు. వ్యక్తిగత, కుటుంబ బాధ్యతలను నిర్వర్తించడంలో తప్పేమీ లేదు. కానీ, తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన వ్యక్తిగా, పదేళ్లపాటు సీఎంగా పనిచేసిన నాయకుడిగా ప్రజల పట్ల కూడా అంతే బాధ్యత ఉండాలి కదా? అన్నది ఇక్కడ ఉత్పన్నమవుతున్న ప్రశ్న. కుటుంబసభ్యులను పరామర్శించేందుకు బయటకు వచ్చే నేత, రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు, ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నప్పుడు, ప్రభుత్వ విధానాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నప్పుడు ప్రజాక్షేత్రంలోకి వచ్చి ఎందుకు మాట్లాడటం లేదన్నది రాజకీయంగా చర్చించాల్సిన అంశం. కుటుంబ కార్యక్రమాలకు హాజరుకావడాన్ని తప్పుబట్టడం కాదు.. ప్రజా సమస్యలపై ఆయన చూపుతున్న మౌనమే విమర్శలకు కారణం.!

ప్రతిపక్ష నేతగా బాధ్యత లేదా?

ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌కు కీలకమైన బాధ్యత ఉంది. అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్షం చేయాల్సిన ప్రధాన పనులు. అయితే, కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రెండు మూడు సార్లు హాజరయ్యారే కానీ.. ప్రజా సమస్యలపై గళమెత్తడం లేదు. మౌన మునిగా ఫామ్ హౌస్ లోనే ఉండిపోవడాన్ని అందరూ విమర్శిస్తున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై విమర్శలు చేయడం మాత్రమే ప్రతిపక్ష బాధ్యత కాదు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యటించాలి. రైతులను పరామర్శించాలి. నిరుద్యోగుల సమస్యలపై స్పందించాలి. ప్రభుత్వ హామీల అమలుపై నిలదీయాలి. ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాడాలి. అలాంటి సందర్భాల్లో కేసీఆర్ ముందుండి పోరాటం



చేయాలని బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణ ప్రజలు ఆశించడం సహజం.

ఆస్తుల అంశంలోనూ మౌనమేనా?

ఇటీవల కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన ఆస్తుల వివరాలు, ఫామ్‌హౌస్‌లు, విలాసవంతమైన హోటల్స్ ఉన్నాయనే విషయం బయటికి వచ్చినప్పటి నుంచి.. తెలంగాణ సమాజంలో విపరీతంగా చర్చ జరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు.. కేసీఆర్ ఆస్తులపై మాట్లాడినా.. తెలంగాణ సమాజం మౌనంగా ఉండటంపై కేసీఆర్ కోపంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఉద్యమ నాయకుడిగా, రెండు సార్లు సీఎంగా పనిచేసిన తాను, తన కుటుంబం ఆస్తులు సంపాదించుకుంటే తప్పేంటనే ఆలోచనలో కేసీఆర్ ఉన్నట్లు తెలుస్తుంది. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌ను ప్రజలు గతంలో ఆదరించారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చారు. కానీ, మూడోసారి మాత్రం అధికారానికి దూరం చేశారు. ఆ తీర్పును ప్రజల నిర్ణయంగా స్వీకరించి, తమ పాలనలో ఎక్కడ తప్పులు జరిగాయో సమీక్షించుకోవాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయకత్వంపై ఉంది. ప్రజలు తమను ఓడించారని అసంతృప్తి వ్యక్తం చేయడం కంటే, ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందే ప్రయత్నం చేయడం ముఖ్యం.

రైతులు అల్లాడుతున్నా స్పందన ఏది?

ఎల్ నినో వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ సమస్యలు, రైతుల ఇబ్బందులు వంటి అంశాలపై ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. ఎక్కడైనా రైతులు నష్టపోతే అక్కడికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలి. ప్రభుత్వ సహాయం అందుతోందా లేదా అనేది పరిశీలించాలి. అవసరమైతే రైతుల తరఫున ఉద్యమించాలి. అయితే, ఇలాంటి సమస్యలపై కేసీఆర్ నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఎస్ఐఆర్ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీతోపాటు.. ఇతర విపక్ష పార్టీలు, జాతీయస్థాయిలో ఆందోళనలు చేస్తున్నాయి. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ను ఆ పదవీ నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఐతే ఈ విషయంలో బీఆర్ఎస్ మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. ప్రజలకు సంబంధించిన అంశాలపై రాజకీయంగా చురుకుగా వ్యవహరించాల్సిన బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్షనేత కేసీఆర్ మాత్రం గత మూడేళ్లుగా మౌన మునిలా ఉంటున్నారు.

తెలంగాణ జాతిపిత నిజంగానే అలిగిండా?

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌కు ప్రజలు అపారమైన రాజకీయ అవకాశాలు ఇచ్చారు. ముఖ్యమంత్రిగా పదేళ్లపాటు పాలించే అవకాశం కల్పించారు. కానీ, ప్రజాస్వామ్యంలో ఏ నాయకుడికీ అధికారం శాశ్వతం కాదు. ప్రజలు ఆదరిస్తారు.. అవసరమైతే తిరస్కరిస్తారు. ఆ తీర్పును గౌరవించి, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడేవారే ప్రజా నాయకులుగా నిలుస్తారు. మరి కేసీఆర్ విషయంలో ఏం జరుగుతోంది? తనను మూడోసారి ముఖ్యమంత్రిని చేయలేదనే అసంతృప్తితో ప్రజలకు దూరంగా ఉంటున్నారా? ఫామ్‌హౌస్‌కే పరిమితమై రాజకీయంగా మరో వ్యూహాన్ని సిద్ధం చేసుకుంటున్నారా? లేక ప్రజాక్షేత్రంలోకి వచ్చేందుకు సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నారా? ఈ ప్రశ్నలకు కేసీఆర్ సమాధానం చెప్పాల్సి ఉంది. ప్రజలు ఓటు వేయలేదని ప్రజలపై అలగడం కాదు. ఎందుకు ఓటు వేయలేదో ఆలోచించుకోవాలి. అధికారం కోల్పోయిన తర్వాత కూడా ప్రజల కోసం పోరాడటమే నాయకుడి అసలైన పరీక్ష. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడకపోయినా, ప్రజా సమస్యలపై పోరాడే నాయకుడిగా చూడాలనుకుంటే ఆయన ప్రజాక్షేత్రంలోకి రావాలి. ప్రజల పక్షాన నిలబడాలి. ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. అప్పుడే ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందే అవకాశం ఉంటుంది. లేకపోతే, కేసీఆర్ మౌనం వెనుక ఉన్న కారణాలపై ప్రశ్నలు కొనసాగుతూనే ఉంటాయి. మరి నిజంగానే జాతిపిత అలిగిండా? లేక ఇదంతా రాజకీయ వ్యూహమా? సమాధానం చెప్పాల్సింది కేసీఆరే.

తిరుమలలో సగానికి తగ్గిన నీటి నిల్వలు

తిరుమల,తిరుమలలో నీటి అవసరాలను తీర్చేందుకు పాపవినాశనం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార జలాశయాలు ఉన్నాయి. ఈ ఐదు రిజర్వాయర్లలో కలిపి 21.60 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగించగా.. 40.08 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా నిల్వ ఉందని టీటీడీ తెలిపింది. దీంతో తిరుమల ముఖ్యమైన ఐదు జలాశయాల్లో 61.68 లక్షల గ్యాలన్ల నీటి పెరుగుదల ప్రధాన నీటి వనరులుగా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌నినో ప్రభావం కనిపిస్తోంది.. ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో నీళ్ల సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందంటున్నారు. తిరుమల నీటి అవసరాల కోసం కొన్ని జలాశయాలు ఉన్నాయి.. తిరుమలలో పాపవినాశనం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార జలాశయాలు ప్రధాన నీటి వనరులుగా ఉన్నాయి.. వీటిలో నీటిమట్టం గురించి టీటీడీ స్పష్టత ఇచ్చింది. తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాల్లో శుక్రవారం వరకు మొత్తం 61.68 లక్షల గ్యాలన్ల నీటి మట్టం పెరిగిందని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఐదు జలాశయాల్లో కలిపి 21.60 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగించగా, 40.08 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా నిల్వ ఉందని తెలిపారు.పాపవినాశనం డ్యామ్ నిల్వ సామర్థ్యం 5,240.00 లక్షల గ్యాలన్లు కాగా.. అంతకముందు 2,667.39 లక్షల గ్యాలన్లు ఉంటే.. ప్రస్తుత నిల్వ 2,688.35 లక్షల గ్యాలన్లకు పెరిగింది.. పెరిగిన నీరు 20.96 లక్షల గ్యాలన్లుగా ఉంది. వినియోగం 14.10 లక్షల గ్యాలన్లు ఉంది.. మిగులు నీరు 6.86 లక్షల గ్యాలన్లుగా ఉంది. గోగర్భం డ్యామ్ నిల్వ సామర్థ్యం 2,833.10 లక్షల గ్యాలన్లు కాగా.. గత రోజు నిల్వ 499.06 లక్షల గ్యాలన్లు ఉన్నాయి.. ప్రస్తుత నిల్వ 508.31 లక్షల గ్యాలన్లుగా ఉంది.. పెరిగిన నీరు 9.25 లక్షల గ్యాలన్లు కాగా, వినియోగం 7.50 లక్షల గ్యాలన్లుగా ఉంది.. మిగులు నీరు 1.75 లక్షల గ్యాలన్లు.ఆకాశగంగ డ్యామ్‌లో నిల్వ సామర్థ్యం 685.00 లక్షల గ్యాలన్లు ఉంటే.. గత రోజు నిల్వ 24.07 లక్షల గ్యాలన్లుగా ఉందని తెలిపారు. ప్రస్తుత నిల్వ 30.40 లక్షల గ్యాలన్లు కాగా.. పెరిగిన నీరు 6.33 లక్షల గ్యాలన్లు.. వినియోగం 0.00 లక్షల గ్యాలన్లు.. మిగులు నీరు 6.33 లక్షల గ్యాలన్లుగా ఉంది. కుమారధార డ్యామ్ నిల్వ సామర్థ్యం 4,259.01 లక్షల గ్యాలన్లు కాగా.. గత రోజు నిల్వ 338.84 లక్షల గ్యాలన్లుగా ఉంది. ప్రస్తుత నిల్వ 363.98 లక్షల గ్యాలన్లు కాగా.. పెరిగిన నీరు 25.14 లక్షల గ్యాలన్లుగా ఉంది. వినియోగం 0 గ్యాలన్లు కాగా.. మిగులు నీరు 25.14 లక్షల గ్యాలన్లుగా ఉంది. పసుపుధార డ్యామ్ నిల్వ సామర్థ్యం 1,287.54 లక్షల గ్యాలన్లు కాగా.. గత రోజు నిల్వ 24.38 లక్షల గ్యాలన్లుగా ఉంది. ప్రస్తుత నిల్వ 24.38 లక్షల గ్యాలన్లు కాగా.. నీరు పెరగలేదు.. వినియోగం లేదు, మిగులు నీరు 0 గ్యాలన్లుగా ఉంది.మొత్తంగా ఐదు జలాశయాల్లో 61.68 లక్షల గ్యాలన్ల నీరు పెరగ్గా, 21.60 లక్షల గ్యాలన్ల నీరు వినియోగమైంది. ప్రస్తుతం 40.08 లక్షల గ్యాలన్ల నీరు మిగులుగా ఉంది. ఆకాశగంగ డ్యామ్ పరిధిలో 8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సమయంలో 7.02 లక్షల గ్యాలన్లు, నవరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో 148.48 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా చేరింది. అక్టోబర్ 23వ తేదీ వరకు మొత్తం 244.46 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా చేరిందని టీటీడీ తెలిపింది.

హైదరాబాద్ జూకు

వంతారా నుంచి కంగారూలు, లెమూర్లు రాక!

హైదరాబాద్,హైదరాబాద్ నగరవాసులకు, ముఖ్యంగా వన్యప్రాణి ప్రేమికులకు నెహ్రూ జూలాజికల్ పార్క్ సరికొత్త జీవులను అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేసింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌కు చెందిన ప్రముఖ గ్లోబల్ వైల్డ్‌లైఫ్ రెస్క్యూ , కన్జర్వేషన్ సెంటర్ వంతారా నుంచి విదేశీ రకాలకు చెందిన అరుదైన జంతువులను నగరానికి తీసుక

మూడో సీటు ఎవ్వరికి....

హైదరాబాద్,తెలంగాణలో ప్రస్తుతం గవర్నర్ కోటా ఎమ్మెల్సీల అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఖాళీగా ఉన్న మూడు స్థానాలలో రెండింటిపైన కాంగ్రెస్ హైకమాండ్ ఓ అంచనాకు వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి ఓ స్థానాన్ని పద్మశాలీలకు, మరోస్థానాన్ని ముదిరాజ్ కులస్తులకు కేటాయించే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చారు. దీంతో మిగిలిన మూడో సీటు ఎవరికి దక్కుతుందనే దానిపై ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సామాజిక న్యాయం, అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత అనే నినాదంతో ముందుకు వెళ్తోంది. ఈ క్రమంలోనే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నామినేషన్ల ప్రక్రియలోనూ సామాజిక సమీకరణాలే కీలకంగా మారాయి. సీఎం రేవంత్ రెడ్డి పద్మశాలి, ముదిరాజ్ వర్గాలకు చెరో స్థానం కేటాయిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో మిగిలిన సామాజిక వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర కులాలు, ఓసీలు, మైనారిటీ వర్గాల నాయకులు మూడో స్థానం కోసం తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించారుతెలంగాణ ఉద్యమకారులు, అమరుల కుటుంబాలు, వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులు సైతం ఈ మూడో స్థానంపై కన్నేశారు. పద్మశాలి వర్గం నుంచి ఎరవత్రి అనిల్, సంగిశెట్టి జగదీశ్వర్ రావు, పున్నా కైలాష్ నేత, జక్కని అనిత తదితరులతో పాటు స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తె డాక్టర్ పవిత్ర వాణి పేరు కూడా పరిశీలనలో ఉంది. అలాగే ముదిరాజ్ సంఘం తరపున నీలం మధు, ఎం. సునీత రావు వంటి నాయకులు తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నారు.మొదటి రెండు స్థానాల కేటాయింపుపై స్పష్టత వచ్చినప్పటికీ, మూడో ఖాళీ స్థానం విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి అధికారిక ప్రకటన చేయకపోవడంతో అన్ని వర్గాల ఆశావహులు ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఓసీ వర్గాల నుంచి ఆర్‌టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు, గుండెపల్లి దయా సాగర్, పవన్ మల్లాది, టీపీసీసీ ఉపాధ్యక్షుడు టి. కుమార్ రావు, టీశాట్ సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తదితరులు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.షెడ్యూల్డ్ కులాల వర్గాల నుంచి సంపత్ కుమార్, ఇందిర, దొమ్మాట సాంబయ్య, అరేపల్లి మోహన్, మానవత రాయ్, వెంకటేష్ వంటి సీనియర్ నేతలు రేసులో నిలిచారు. షెడ్యూల్డ్ తెగల నుంచి బెల్లయ్య నాయక్ తన ప్రయత్నాలను తీవ్రతరం చేశారు. బీసీ వర్గాల నుంచి సట్టు మల్లేశం, చనగాని దయాకర్, చరణ్ కౌశిక్ యాదవ్, లోకేష్ యాదవ్, నేరెళ్ల శారద తదితరులు గట్టి పోటీ ఇస్తున్నారు. ఇక మైనారిటీల నుంచి ముస్లిం, క్రైస్తవ వర్గాల నాయకులు కూడా తమకు శాసనమండలిలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ పార్టీ పెద్దలను కలుస్తున్నారు.రాష్ట్రంలో పార్టీ పరంగా అన్ని వర్గాల నుంచి వస్తున్న ఒత్తిళ్లు, ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో కాంగ్రెస్ నాయకత్వానికి ఈ ఎంపిక కత్తి మీద సాములా మారింది. రాష్ట్ర స్థాయి పర్యటనలు, అంతర్గత చర్చల అనంతరం, సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి పార్టీ జాతీయ నాయలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయనున్నారు.

సాగు 'విస్తరణ'లో సమస్యల మేట



హైదరాబాద్,ప్రభుత్వ వ్యవసాయ విస్తరణ వ్యవస్థపై ఎన్నో విమర్శలున్నాయి. ఇది సామర్థ్యానికి మించిన భారంతో ఒత్తిడికి గురవుతోంది. ఫలితంగా, రైతులకు అందాల్సిన సేవలు, ఉత్పాదకత, కర్షకుల నిర్ణయాలపై దుష్ప్రభావం పడుతోంది. ఈ సమస్యల్ని అత్యవసరంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. హరిత విప్లవ కాలంలో పుట్టుకొచ్చిన వ్యవసాయ విస్తరణ వ్యవస్థ మన దేశానికి ఆహార భద్రతను అందించింది. దిగుబడుల పెరుగుదల, హెచ్.వై.వి. విత్తనాలు, రసాయన ఎరువులు, నీటిపారుదల సాంకేతికతల ప్రసారంలో చేదోడు వాదోడుగా నిలిచింది. 1960లలో రూపొందించిన ఈ వ్యవస్థ అప్పటి అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి కేంద్రీకృత నమూనాగా పనిచేసింది. పరిశోధనా కేంద్రాల నుంచి రైతు పొలానికి సాంకేతికతలను చేరవేయడమే దీని ముఖ్య లక్ష్యం. ఇది దేశాన్ని ఆహార కొరత నుంచి ఆత్మనిర్భరత వైపు నడిపించింది. కానీ నేడు వ్యవసాయం పూర్తిగా మారిపోయింది. వాతావరణ అనిశ్చితి, మార్కెట్ హెచ్చుతగ్గులు, అంతర్జాతీయ ప్రభావాలు, చిన్న భూపరిమాణాలు వంటివన్నీ రైతు నిర్ణయాలకు బహుముఖ సవాళ్లు విసురుతున్నాయి. విస్తరణ వ్యవస్థ మాత్రం పాత నిర్మాణం, పాత పద్ధతుల్లోనే కొనసాగుతోంది. ఫలితంగా రైతుకు సకాలంలో, సందర్భానుసారంగా, విశ్వసనీయమైన సలహాలు అందడం తగ్గిపోయింది. విస్తరణ సిబ్బంది పథకాల అమలు, డేటా సేకరణ, ధ్రువీకరణ పనుల్లోనే చిక్కుకుపోయారు.

క్షేత్రస్థాయిలో రైతుకు దూరమై...

వ్యవసాయ విస్తరణ వ్యవస్థలో రైతులతో క్షేత్రంలో గడిపే సమయం తగ్గిపోయింది. డీబీటీ ధ్రువీకరణలు, సబ్సిడీలు, పోర్టల్ నిర్వహణ, సమావేశాలు వంటి పనులే ఎక్కువయ్యాయి. ఒక విస్తరణ అధికారి తన విధుల్లో 70శాతానికిపైగా పరిపాలనా బాధ్యతలకే కేటాయిస్తున్నారు. సాంకేతిక సలహాదారుడు డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా మారుతున్నారు. ఫలితంగా క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన తగ్గిపోతోంది. సలహాలూ యాంత్రికంగానే మారాయి. దాంతో రైతుల్లో క్రమంగా నమ్మకం సన్నగిల్లుతోంది. దేశ వ్యాప్తంగా సుమారు 1.2లక్షల మంది విస్తరణ సిబ్బంది 15 కోట్లకు పైగా రైతు కుటుంబాలకు సేవలు అందిస్తున్నారు. ఒక్కొక్క అధికారి వేలమంది రైతులను పర్యవేక్షించాల్సి వస్తోంది. తెలుగు రాష్ట్రాల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఏపీ, తెలంగాణలలో అధికారి, రైతుల నిష్పత్తి 1:3,000 నుంచి 1:5,000 వరకు ఉంది. ఇది 1:100 నుంచి 1:750 నిష్పత్తిలో ఉండాలని ప్రపంచబ్యాంకు సూచించింది. మొత్తం విస్తరణ బడ్జెట్‌లో 85-97శాతం జీతాలకే వెళ్తుండగా, క్షేత్ర కార్యకలాపాలకు 3-15శాతమే మిగులుతోంది. ఫీల్డ్‌లో ప్రదర్శనలు, ప్రయాణాలు, రైతు సమావేశాలకు అవసరమైన వనరులు లేకపోవడంతో కార్యకలాపాలన్నీ కార్యాలయాలకే పరిమితమ వుతున్నాయి. తక్కువ నిష్పత్తి, స్పష్టమైన బాధ్యతలు, ఫీల్డ్ సపోర్ట్, రైతుతో నిరంతర సంబంధం లేకుండా సమర్థ విస్తరణ సాధ్యం కాదు. మన దేశంలో కేవీకేలు ఆవిష్కరణ కేంద్రాలుగా పనిచేస్తున్నా, గ్రామస్థాయి విస్తరణకు అవి ప్రత్యామ్నాయం కాలేవు. రైతు-రైతు ఆధారిత నమూనాలు విజయవంతమైనా, వాటికి సమయం, నిరంతర సంబంధాలు అవసరం. ఇది ప్రస్తుత వ్యవస్థలో అందుబాటులో లేదు. అందుకని, తక్షణ చర్యలుగా విస్తరణ సిబ్బందిపై ఉన్న పరిపాలన భారాన్ని తగ్గించి, ప్రత్యేక డేటా సపోర్ట్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ఫీల్డ్ కార్యకలాపాలకు కనీసం నలభై శాతం బడ్జెట్ కేటాయించాలి. కేవీకేలు, వర్సిటీలు, ప్రైవేట్ రంగం, ఎఫ్‌పీవోలను అనుసంధానించే బ్లాక్ ఎక్స్‌టెన్షన్ హబ్‌లు ఏర్పాటు చేయాలి. తెలంగాణ ప్రభుత్వం 15 జిల్లాల్లో రైతు విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇవి రైతులకు శిక్షణ, సాంకేతిక సాయం అందిస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామ స్థాయిలో ఫెసిలిటేటర్లు, బ్లాక్ స్థాయిలో స్పెషలిస్టులు, డేటా సపోర్ట్ సిబ్బంది అనే మూడు స్థాయిలను అభివృద్ధి చేయాలి.

వ్యూహాత్మక పునర్నిర్మాణం అవసరం

రైతుల నిర్ణయాలను శక్తిమంతంగా మార్చడంలోనే విస్తరణ వ్యవస్థ విజయం ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వం ఎన్ని పథకాలు అమలు చేసినా, ఎంత డేటా సేకరించినా రైతులకు సకాలంలో సరైన సలహా అందకపోతే ప్రయోజనం ఉండదు. ఈ విషయంలో వ్యూహాత్మక పునర్నిర్మాణం అవసరం. సిబ్బందికి ఇతరత్రా కార్యకలాపాలను పరిహరించాలి. రైతులతో నిరంతర సంబంధాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే వ్యవసాయ విస్తరణ వ్యవస్థ శక్తిమంతమవుతుంది. రైతు నిర్ణయాలు సరిగ్గా ఉంటేనే వ్యవసాయం లాభసాటిగా, స్థిరంగా, సమతుల్యంగా మారుతుంది. విస్తరణ వ్యవస్థ రైతుకు అందుబాటులో ఉంటేనే ఇదంతా సాధ్యం. దీనికి అవసరమైన చర్యలను అత్యవసరంగా చేపట్టాలి. ఏఐ ఆధారిత సూచనలు, వాతావరణ హెచ్చరికలు, మార్కెట్ సమాచారం వంటి సాంకేతికతలను విస్తరణలో భాగంగా చేయాలి. ముఖ్యంగా రైతుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా పనితీరును అంచనా వేయాలి. రైతు కేంద్రీకృత విస్తరణ విధానం ద్వారానే సుస్థిర వ్యవసాయం సుసాధ్యం. ఇదే మన లక్ష్యమవ్వాలి.

జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలి

రంపచోడవరం,జిల్లాలో జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక మండల విద్యా శాఖ అధికారి కార్యాలయం లో ఏర్పాటు చేసిన ఎన్నికల విధుల నిర్వహణలో భాగంగా ప్రిసైడింగ్ అధికారులు (పీవోలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవోలు)కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని, ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఎన్నికల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు.వై. రామవరం మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల హ్యాండ్‌బుక్‌లో పొందుపరిచిన విధివిధానాలను పూర్తిగా అవగాహన చేసుకుని, వాటికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు.పోలింగ్‌కు ముందు చేపట్టాల్సిన ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రంలో అనుసరించాల్సిన విధానాలు, పోలింగ్ సామగ్రి వినియోగం, ఓటర్ల గుర్తింపు, ఓటింగ్ ప్రక్రియ, పోలింగ్ ముగిసిన అనంతరం చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని ఆయన తెలిపారు.విధుల నిర్వహణలో ఎలాంటి సందేహాలు ఉన్నా శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎన్నికల విధుల నిర్వహణకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సిబ్బందిని నియమించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాతంగా వ్యవహరించడం,ఎన్నికల నియమావళిని పాటించడం, ఓటర్లకు అవసరమైన సహకారం అందించడం, పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించడం ప్రతి ఎన్నికల సిబ్బంది బాధ్యత కలెక్టర్ స్పష్టం చేశారు.మండలంలోని పీవోలు, ఏపీవోలు ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తారని, వారికి అందించిన శిక్షణను సద్వినియోగం చేసుకుని ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సిబ్బంది మధ్య సమన్వయం, సమయపాలన, అప్రమత్తతతో పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సంబంధిత అధికారులు, ఎన్నికల సిబ్బంది సమష్టిగా కృషి చేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆకాంక్షించారు. పోలవరం జిల్లాలో ఎన్నికల సిబ్బంది పోలింగ్కు సంబంధించిన సామాగ్రిని ఒకటికి రెండుసార్లు పూర్తిస్థాయిలో పరిశీలించుకోవాలన్నారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉన్న యెడల వెంటనే రిటర్నింగ్ అధికారి వెంటనే తెలియజేయాలని ఆయన అన్నారు.ఈ శిక్షణ కార్యక్రమానికి ఆర్వో నరేంద్ర కుమార్, తహసీల్దార్ శ్రీరాములు,ఎంపీడీఓ కె. బాపన్న దొర, పి ఓ లు, ఏ పి ఓ లు తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్ ను మించిపోతున్న ఆంధ్రా

విజయవాడ, ఏపీ పోర్టులు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణాతో దేశంలోనే రెండో స్థానంలో నిలిచాయి. నౌకల టర్న్ ఎరౌండ్ సమయం తగ్గించడం, వసతులు మెరుగుపడటంతో గత ఏడాదితో పోలిస్తే సరకు రవాణాలో 12 శాతం పెరుగుదల నమోదైంది. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ పోర్టులు పూర్తైతే మరో 109 ఎంఎంటీల సామర్థ్యం అదనంగా అందుబాటులోకి వస్తుంది. ఈ లక్ష్యాలు నెరవేరితే నాన్-మేజర్ పోర్టుల సరకు రవాణాలో మొదటి స్థానంలో ఉన్న గుజరాత్‌ను ఆంధ్రప్రదేశ్ త్వరలోనే దాటేయడం ఖాయంగా కనిపిస్తోంది.సముద్ర వాణిజ్యంలో ఆంధ్రప్రదేశ్ రికార్డు స్థాయిలో దూసుకుపోతోంది. 2025-26 సంవత్సరానికిగానూ రాష్ట్రంలోని పోర్టుల ద్వారా సుమారు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఓఓ) సరకు రవాణా జరగడంతో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. నాన్-మేజర్ పోర్టుల కార్గో సామర్థ్యంలో ప్రస్తుతం గుజరాత్ టాప్ 1లో ఉంది. ఏపీ వ్యూహాత్మక అడుగులతో భవిష్యత్తులో గుజరాత్‌ను వెనక్కి నెట్టి నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకునే దిశగా పయనిస్తోందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్-డీజీసీఐఎస్ (తాజా లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.2025-26 సంవత్సరానికి పోర్టుల ద్వారా సుమారు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా అయింది. 2024-25తో పోలిస్తే ఇది సుమారు 12 శాతం ఎక్కువ. దేశంలో నాన్- మేజర్ పోర్టుల సరకు రవాణా సామర్థ్యంలో గుజరాత్ ప్రథమ స్థానంలో ఉంది. ఏపీ రెండో స్థానంలో నిలిచింది. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్-డీజీసీఐఎస్ రీసెంట్‌గా వెల్లడించింది.విశాఖ మేజర్ పోర్టు నుంచి 91.17 ఎంఎంటీల రవాణా జరిగింది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే ఇది 10.35 శాతం పెరుగుదల. గతంలో రవాణా కేవలం 82.62 ఎంఎంటీలుగా ఉంది. ఈ ఏడాది రాష్ట్రంలోని నాన్-మేజర్ పోర్టుల ద్వారా 118.83 ఎంఎంటీల రవాణా జరిగింది. నౌకల టర్న్ ఎరౌండ్ టైమ్‌ని తగ్గించడం, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా తెలుస్తుంది.కాగా ప్రస్తుతం విశాఖ పట్నం, గంగవరం, కృష్ణపట్నం తదితర పోర్టుల మొత్తం సామర్థ్యం 327.5 ఎంఎంటీలు. అందులో కేవలం 64.12 శాతం మాత్రమే వినియోగించుకోవడం జరుగుతుంది. ఈ పూర్తి సామర్థ్యాన్ని వాడుకోవాల్సి ఉంది. దీంతోపాటు కొత్తగా నిర్మాణంలో ఉన్న రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ పోర్టుల తొలిదశ పనులు పూర్తయితే అదనంగా మరో 109 ఎంఎంటీల సామర్థ్యం అందుబాటులోకి వస్తుంది. 2026-27 నాటికి నాన్-మేజర్ పోర్టుల సామర్థ్యాన్ని 191 ఎంఎంటీల నుంచి 285 ఎంఎంటీలకు పెంచాలన్న ఏపీ మారిటైం పాలసీ లక్ష్యం నెరవేరితే, దేశ కార్గో రవాణాలో గుజరాత్‌కు ఏపీ గట్టి పోటీ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

నీళ్లు లేక కరెంట్ రాక..

సూర్యాపేట: తెలంగాణలో సాగు దుర్భరంగా మారింది. అన్నదాతలు అప్పులు చేసి సాగు చేస్తే సరిపడా నీళ్లు, కరెంట్ అందక పంటలు చేతికొచ్చే సమయంలో ఎండిపోతుండటంతో కలత చెందిన రైతన్నలు కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలకు నిప్పు పెట్టడం రాష్ట్రంలో రైతుల పరిస్థితికి అద్దం పడుతున్నది. తాజాగా సూర్యాపేట జిల్లాలో మరో రైతు పంటకు నిప్పు పెట్టాడు. కౌలుకు తీసుకున్న నాలుగెకరాలలో మూడెకరాలు ఎండిపోవడంతో తీవ్ర ఆవేదన చెందిన రైతు పంటకు నిప్పు పెట్టాడు. వివరాల్లోకి వెళ్తే..సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలో యాతాకుల మల్లయ్య అనే రైతు తాను కౌలుకు చేస్తున్న నాలుగెకరాల పంట చేతికి వచ్చే సమయంలో కరెంట్, నీళ్లు సరిగా అందక మూడెకరాల పంట ఎండిపోయింది. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన సదరు రైతు పంటకు నిప్పంటించాడు. కౌలు ఎట్లా కట్టాలి, పెట్టుబడి ఎట్లా ఎల్లాలి, కుటుంబం ఎట్లా గడవాలి అని బాధిత కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి పంటలకు సరిపడా నీళ్లు, కరెంట్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

రాజకీయాలలో 'భారతీయ ఆత్మ' ఎక్కడ?

న్యూఢిల్లీ,భారత రాజకీయ యవనికపై ప్రస్తుతం నడుస్తున్న పరిణామాలు కేవలం సాధారణ ప్రభుత్వ మార్పిడి లేదా ప్రతిపక్షాల విమర్శల చుట్టూ మాత్రమే తిరగడం లేదు. అది అంతకంటే లోతైన, తీవ్రమైన ప్రజాస్వామ్య సంక్షోభాన్ని సూచిస్తోంది. సృష్టి, వినాశనాల మధ్య సాగే మహా తాండవ నృత్యానికి నిర్దిష్టమైన ప్రణాళిక అవసరం లేదని, విశ్వానికి ఆ అడుగులు ముందే తెలుసని కాంగ్రెస్ నాయకుడు రాహు ల్ గాంధీ పేర్కొన్న మాటలు ప్రస్తుత రాజకీయ వాతావరణానికి సరిగ్గా సరిపోతాయి. అధికార పీఠంపై ఉన్న ప్రభుత్వ అణచివేత చర్యలు ఎంతటి తీవ్రమైన స్థాయికి చేరుతున్నాయో, దానికి అంతే స్థాయిలో వీధుల్లో యువత నుంచి తీవ్రమైన తిరుగుబాటు ఎదురవుతోంది. ఈ పరిస్థితులు దేశ రాజకీయ భవిష్యత్తును ఒక సరికొత్త మలుపు తిప్పే సూచనలను స్పష్టంగా కనిపింపజేస్తున్నాయి.నేడు మన కళ్లముందు కనిపిస్తున్న అత్యంత విచారకరమైన నిజమేమిటంటే, వలసపాలన ముగిసి దశాబ్దాలు గడిచినా, భారత పాలనా యంత్రాంగం, రక్షక భట వ్యవస్థలు ఇంకా నాటి ముద్రల నుంచి బయటపడలేకపోవడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుడు చెప్పేదే నిజమని నమ్మి, అతడు తప్పు చేశాడని నిరూపించే బాధ్యత ప్రభుత్వంపై ఉండాలి. కానీ మన దేశంలో ప్రతి పౌరుడినీ అనుమానాస్పదంగా చూడటం, అతడు తన నిర్దోషిత్వాన్ని తాను నిరూపించుకోవాల్సిన పరిస్థితికి నెట్టడం పరిపాటిగా మారింది. పోలీసు బలగాలు సైతం తమ రాజకీయ యజమానుల ప్రయోజనకరం, వారి ఆదేశాలతో శాంతియుత నిరసనకారులు, మహిళలు, విద్యార్థులపై నిర్దాక్షిణ్యంగా దాడులు చేస్తుండటం అంతర్జాతీయంగా దేశ ప్రతిష్టను దిగజార్చుతోంది. 1977 అత్యవసర పరిస్థితి కాలంలో నటి స్నేహలతా రెడ్డి, సాంకేతిక విద్యార్థి పి. రాజన్ వంటి వారి ప్రాణాలు బలితీసుకున్న నాటి పోలీసు క్రూరత్వం నేటికీ మారలేదనడానికి ప్రస్తుత సంఘటనలే ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. 1977లో జాతీయ రక్షక భట సంఘం ఏర్పాటైనా, అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినా రక్షక భట సంస్కరణలు నెరవేరకుండా కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి.ప్రస్తుత మోడీ ప్రభుత్వం ప్రతిపక్షాలను, సామాజిక కార్యకర్తలను, విద్యార్థులను ఏళ్ల తరబడి విచారణ లేకుండా జైళ్లలోనే ఉంచడానికి ఉపయోగిస్తున్న నిరంకుశ చట్టాల మూలాలు గత పాలనలోనే ఉన్నాయి. భీమా కోరేగావ్ నిందితులు, శార్జీల్ ఇమామ్, ఉమర్ ఖలీద్ వంటి వారిపై ఉపయోగిస్తున్న చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం, జాతీయ భద్రతా చట్టం, సమాచార సాంకేతిక చట్టంలోని వివాదాస్పద విభాగాలు, విదేశీ విరాళాల నియంత్రణ చట్టం వంటి వాటిని గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాలు తమ ప్రయోజనాల కోసం తెచ్చినవేనన్నది చేదు నిజం. నేడు పాలక ప్రభుత్వం ఆ చట్టాల పదును పెంచి పౌర హక్కులను, విమర్శకుల గొంతులను మరింతగా కాలరాస్తోంది. ప్రజాస్వామ్యాన్ని మరియు దేశ భద్రతను రక్షించడానికని తెచ్చిన చట్టాలే నేడు పౌరుల ప్రాథమిక హక్కులను తొక్కిపెట్టే ఆయుధాలుగా మారడం ఒక చారిత్రక నిర్లక్ష్యం. గతాన్ని సరిదిద్దుకుని, తమ హయాంలో చేసిన పొరపాట్లను అంగీకరించి ప్రాయశ్చిత్తం చేసుకున్నప్పుడే వివక్షాలకు ప్రజాస్వామ్య వ్యవస్థను పునరుద్ధరించే నైతిక హక్కు దక్కుతుంది. అదే సమయంలో, దేశ రాజధాని ఢిల్లీ వీధుల్లో జరుగుతున్న నిరసనలు,



తిరుగుబాట్లు నూతన రాజకీయ చైతన్యానికి సంకేతంగా నిలుస్తున్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల ఆక్రోశం, అంతర్జాల మాధ్యమాల్లో పొంగిపొర్లుతున్న యువత ఆగ్రహం వ్యవస్థాగత మార్పును గట్టిగా కోరుకుంటున్నాయి. దేశంలో ప్రధానమైన ప్రదేశంలో 'త్రివర్ణ పతాక ప్రదర్శన'కు అనుమతి నిరాకరించడం, చేతిలో జాతీయ జెండాను చేతబూనిన వారిని కూడా అనుమానించడం చూస్తుంటే, అసలు పౌరుడు దేశభక్తుడో కాదో నిర్ణయించే హక్కు ఎవరికి ఉందనే ప్రశ్న ప్రతి ఒక్కరిలో తలెత్తుతోంది. ప్రభుత్వం ప్రజల దృష్టిని ఈ ఆందోళనల నుంచి మళ్లించడానికి ఎంత ప్రయత్నించినా, వీధుల్లో వ్యక్తమవుతున్న నిరసన జ్వాలల కాకను కప్పిపుచ్చడం ఏమాత్రం సాధ్యం కావడం లేదు. విదేశాంగ దౌత్యం, అంతర్జాతీయ చమురు ఒప్పందాల మెరుపుల వెనుక దేశీయంగా చెలరేగుతున్న తీవ్ర అసంతృప్తిని కప్పిపుచ్చడం సులభం కాదు.అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పర్యటనలు, పారిశ్రామిక దిగ్గజాల వ్యాపార వ్యూహాలు ప్రభుత్వానికి కొంత ఊరటనిచ్చినప్పటికీ, స్వదేశంలో మండుతున్న నిరుద్యోగం, అణచివేత సమస్యలకు అవి ఏమాత్రం పరిష్కారం చూపలేవు. విదేశాల్లో భారత్ తన బలాన్ని, ప్రభావాన్ని చాటుకోవాలంటే ముందుగా స్వదేశంలో ఉత్పన్నమవుతున్న రాజకీయ అలజడులను కారుణ్యంతో, రాజ్యాంగబద్ధంగా పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికార బలగాలతో, అణచివేత చర్యలతో నిరసనలను తాత్కాలికంగా ఆపవచ్చేమో కానీ, పౌరుల మనస్సులో రగులుతున్న అసంతృప్తిని చల్లార్చలేరు. రాబోయే రోజుల్లో జరిగే వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు కేవలం సాధారణ అధికార మార్పిడికి మాత్రమే కాకుండా, ఈ నిరంకుశ రాజకీయ సంస్కృతికి ఒక ప్రజా తీర్పుగా మారబోతున్నాయి. ఒకపక్క ప్రతిపక్షాలను ఏకం చేస్తూ రాహుల్ గాంధీ వేస్తున్న వ్యూహాత్మక అడుగులు, మరొకపక్క తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రభుత్వం ప్రయోగిస్తున్న అధికార బలగాలు – ఈ రెండింటి మధ్య నలిగిపోతున్నది మాత్రం సామాన్య పౌరుడేనని స్పష్టమవుతోంది. అవినీతి, పాతకాలపు రాచరికపు పోకడలతో కూడిన రాజకీయాలకు పూర్తి స్వస్తి పలికి, విశాలమైన మరియు క్షమించే గుణం కలిగిన భారతీయ ఆత్మను పునరుద్ధరించడమే నేటి అత్యంత ప్రధానమైన అవసరం. ఈ అణచివేత తాండవం ముగిసిన తర్వాతే, భారత ప్రజాస్వామ్య పుస్తకంలో ఒక సరికొత్త అధ్యాయం, నూతన ఉషోదయం ప్రారంభమవుతుందని ఆశించవచ్చు.

పేరుకే గాంధీ పార్క్.. అంతా అధ్వానమే!

కోదాడ, ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇవ్వాల్సిన కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ పార్క్.. నేడు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. ఆహ్లాదాన్ని పంచాల్సిన ఆవరణ, వ్యాయామానికి ఉపయోగపడాల్సిన పరికరాలు తుప్పుపట్టి మూలకు చేరాయి. నడకకు అనువుగా ఉండాల్సిన వాకింగ్ ట్రాక్ బండరాళ్లు పైకి తేలి అధ్వానంగా మారింది. మరుగుదొడ్ల నుంచి వెలువడే దుర్వాసనతో పార్కులోకి వెళ్లాలంటేనే కోదాడ పట్టణ ప్రజలు ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు ఉదయం వేళల్లో వందలాది మందికి ఆరోగ్యాన్ని పంచిన ఈ పార్క్.. ఇప్పుడు పాలకుల, మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యానికి ఆనవాలుగా నిలుస్తోంది. జాతీయ పండుగలప్పుడు జెండా ఎగురవేసేందుకు వచ్చే నాయకులు, అధికారులు.. ఆ తర్వాత పార్క్ నిర్వహణను మాత్రం గాలికొదిలేస్తున్నారనే విమర్శలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి.

జెండా పండుగలప్పుడే హడావుడి!

ఆగస్టు 15,

విజయ్ బాటలోనే త్రిష?



చెన్నై, సినీ తారలు షాపింగ్ మాల్స్, మొబైల్ షోరూమ్‌ల ప్రారంభోత్సవాలకు రావడం మామూలే కానీ.. కోయంబత్తూరు వీధుల్లో సౌత్ క్వీన్ త్రిష సృష్టించిన సునామీ మాత్రం ఇటు కోలీవుడ్‌ను, అటు తమిళనాడు రాజకీయ వర్గాలను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఒక చిన్న మొబైల్ షాప్ ఓపెనింగ్ కోసం వచ్చిన త్రిష, ఏకంగా ఒక బడా పొలిటికల్ లీడర్ రేంజ్‌లో కారు సన్‌రూఫ్ నుంచి బయటకు వచ్చి.. వేలాదిగా తరలివచ్చిన జనసందోహానికి చిరునవ్వుతో అభివాదం చేస్తూ హంగామా చేసింది. ఎర్రటి కాటన్ చీరలో దేవతలా మెరిసిపోతూ ఆ నడిరోడ్డుపై ఆమె చేసిన మాస్ రోడ్ షో చూసి కంగారు పడటం కోయంబత్తూరు వాసుల వంతయింది. ఈ రోడ్ షో వీడియోలు నెట్టింట ప్రత్యక్షమవ్వడమే ఆలస్యం.. తమిళనాడు సోషల్ మీడియా స్టీమ్ రేంజ్‌లో వేడెక్కిపోయింది. ఇది షాపింగ్ మాల్ ప్రమోషన్ లా లేదు.. ముమ్మాటికీ అంచెలంచెలుగా ప్లాన్ చేసిన పొలిటికల్ కట్ట స్ట్రాటజీలా ఉంది అంటూ ఎక్స్ , ఇన్‌స్టాగ్రామ్‌లలో కామెంట్ల వర్షం కురుస్తోంది. మొబైల్ షాప్ ప్రారంభించడానికి వచ్చిన భామ, ఆ పనిని ఎలక్షన్ ర్యాలీగా మార్చేయడం వెనుక సాధారణమైన పబ్లిసిటీ మాత్రమే లేదని, ప్రజల్లో తనకున్న క్రేజ్‌ను చెక్ చేసుకోవడానికే ఈ స్థాయి పబ్లిక్ కనెక్ట్ షో ప్లాన్ చేసిందని గట్టి ప్రచారం సాగుతోంది.దళపతి విజయ్ పార్టీలో చేరి ఆమె కీలకపాత్ర పోషిస్తారన్న ప్రచారం జరుగుతోంది. తిరుచ్చి ఉపఎన్నిక ఇంకా జరగాల్సి ఉంది. ఆమె పేరు తరచూ ప్రచారంలోకి వస్తూనే ఉంది.తమిళనాడులో పురాతన కాలం నుంచి సినీ స్టార్లను నెత్తిన పెట్టుకుని రాజకీయాల్లో కిరీటాలు కట్టబెట్టే ఆచారం ఉంది కాబట్టి, త్రిష ప్లాన్ కూడా అదేనని నెటిజన్లు విశ్లేషిస్తున్నారు.మరోవైపు, ఎరుపు రంగు శారీలో త్రిష మెరిసిన గ్లామరస్ లుక్స్, ఆమె కారు పైనుంచి అభిమానులకు ఫ్లయింగ్ కిస్‌లు ఇస్తున్న వీడియోలు ప్రస్తుతం నెట్టింట రికార్డ్ వ్యూస్‌తో దూసుకుపోతున్నాయి.రాజకీయాల్లోకి వస్తే ప్రత్యర్థులకు నిద్రలేకుండా చేసే గ్లామర్ అండ్ మాస్ ఫాలోయింగ్ త్రిష సొంతం అంటూ ఫ్యాన్స్ హంగామా చేస్తుంటే.. మేడమ్ మైక్ పట్టుకోవడం ఖాయం" అంటూ మీమర్స్ సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. మొత్తానికి ఒక చిన్న షాప్ ఓపెనింగ్‌తో తమిళనాడు పొలిటికల్ అండ్ సినిమా సర్కిల్స్ రెండింటిలోనూ త్రిష పెట్టిన మంటలు త్వరలో ఎలాంటి మలుపు తిరుగుతాయో చూడాలి!

ప్రశ్నార్థకంగా మారిన బార్ల మనుగడ

ఖైరతాబాద్:రాష్ట్ర ప్రభుత్వం విధించిన ప్రివిలేజ్ టాక్స్‌తో బార్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ అన్నారు. ఈ పన్నును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో ఆయన నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దామోదర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రివిలేజ్ టాక్స్ కారణంగా ఒక్కో క్వార్టర్ మద్యం బాటిల్, బీర్‌పై రూ. 60 అదనపు

అర్నాబ్ తుపాను ఎఫెక్ట్.. పాపికొండలు విహారయాత్రకు బ్రేక్..!

హైదరాబాద్, బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నాబ్ తుపాను ' తీరంవైపు దూసుకొస్తున్న నేపథ్యంలో పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాపికొండల విహారయాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈరోజు నుంచి గోదావరి నది లో పర్యాటక బోట్ల రాకపోకలను పూర్తిగా రద్దుచేస్తూ రంపచోడవరం సబ్-కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.తుపాను ప్రభావంతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైనగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రాజమండ్రి, భద్రాచలం తదితర ప్రాంతాల నుంచి సర్వీసులు నడిపే సుమారు 16 పర్యాటక బోట్లను నిలిపివేశారు. గతంలో గోదావరికి వచ్చిన భారీ వరదల కారణంగా సుమారు 70 రోజులపాటు నిలిచిపోయిన పాపికొండల యాత్ర, కేవలం రెండు వారాల క్రితమే తిరిగి ప్రారంభమైంది.అప్పుడే పర్యాటకుల రాక కూడా పుంజుకుంటోంది. ఆదివారం ఒక్కరోజే మూడు బోట్లలో దాదాపు 199 మంది పర్యాటకులు పాపికొండల అందాలను వీక్షించారు. ఇంతలోనే తుపాను



ముప్పు ముంచుకు రావడంతో యాత్రకు మరోసారి బ్రేక్ పడింది. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గిన తర్వాత, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారితేనే బోటింగ్ సేవలను పునరుద్ధరిస్తామని అధికారులు స్పష్టంచేశారు. పర్యాటకులు ప్రస్తుతానికి గోదావరి నదీ ప్రాంతాలకు రావొద్దని సూచించారు.

కమలానికి దారేది...

హైదరాబాద్, తెలంగాణ ప్రజలు బీజేపీని ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతున్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా ఏకైక లేదా సంపూర్ణ ప్రత్యామ్నాయంగా మారడానికి ఇంకా మిశ్రమ ఫలితాలు, సవాళ్లు ఎదుర్కొంటోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు సాధించి 35 శాతం ఓట్లతో బలమైన పునాది వేసుకున్నప్పటికీ, ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కంటే వెనుకబడి మూడో స్థానానికే పరిమితమైంది.ప్రజల్లో మరియు రాజకీయ క్షేత్రంలో బీజేపీ స్థానాన్ని పదిలం చేసుకునే ప్రయత్నిస్తుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఎనిమిది స్థానాలు, పెరిగిన ఓట్ల శాతం ఆ పార్టీకి పెద్ద ఊరటనిచ్చాయి. కొన్ని పట్టణ, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో ప్రజలు కేంద్రంలో మోదీ నాయకత్వాన్ని చూసి ఓటేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగే ప్రయత్నం అప్పటి నుంచే మొదలు పెట్టింది. బీఆర్ఎస్ బలహీనపడిన సమయాల్లో, కాంగ్రెస్‌కు తామే అసలైన ప్రత్యామ్నాయం అని, హైడ్రా వంటి ప్రజా వ్యతిరేకత ఉన్న అంశాలపై పోరాడుతూ బీజేపీ ప్రజల్లోకి వెళ్తోంది. 2026 ప్రారంభంలో జరిగిన తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ ఘన విజయం సాధించగా, బీఆర్ఎస్ రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ దాదాపు 20శాతం ఓట్లను కోల్పోయి మూడో స్థానానికి పడిపోయింది. స్థానిక ఎన్నికల్లో త్రిముఖ పోటీ వల్ల బీజేపీ కేవలం ఓట్లను చీల్చే 'స్పాయిలర్' గానే మారిందని విశ్లేషకులు చెబుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో బలమైన క్యాడర్, ప్రజాకర్షణ గల స్థానిక నాయకులు లేకపోవడం బీజేపీకి పెద్ద మైనస్. అలాగే తెలంగాణ ప్రాంతీయ సెంటిమెంట్‌కు, బీజేపీ జాతీయవాద విధానాలకు మధ్య ఉన్న వ్యత్యాసం కూడా ప్రభావం చూపుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పాలన, అవినీతితో ప్రజలు విసిగిపోయారని, సర్వేల ప్రకారం తామే రాబోయే కాలంలో తెలంగాణలో అధికారంలోకి వస్తామని, ఏకైక ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొంటున్నారు.. తెలంగాణలో ఓటు బ్యాంకు పెంచుకోవడంతో పాటు నాయకత్వాన్ని కూడా పెంచుకోవడం బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి రానున్న కాలంలో సవాల్ అని చెప్పక తప్పదు. ప్రజలు కూడా బీజేపీ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉంటే డబుల్ ఇంజిన్ సర్కార్ తో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావిస్తే కమలం పార్టీకి అధికారం చేరువవుతుంది. తెలంగాణలో పోటీ ఎప్పుడూ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని, బీజేపీ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వంటి వారు అంటున్నప్పటికీ ప్రజలు ఇచ్చే తీర్పునకు అందరూ కట్టుబడి ఉండాల్సిందే. ప్రస్తుతానికి తెలంగాణ ప్రజలు బీజేపీని ఒక బలమైన శక్తిగా గుర్తిస్తున్నప్పటికీ, పూర్తి స్థాయి అధికార ప్రత్యామ్నాయంగా మార్చడానికి ఇంకా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని బీజేపీ చెబుతుండటంతో త్రిముఖ పోరు ఆసక్తికరంగా మారనుంది. అందుకు అవసరమైన కసరత్తును ఇప్పటి నుంచే ప్రారంభించాల్సిన అవసరం ఉంది.

నవంబర్ లో షా టూర్

తెలంగాణలో రాజకీయ వేడి రాజుకుంటోంది. అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, అధికార పీఠమే లక్ష్యంగా బీజేపీ ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టింది. రాష్ట్రస్థాయి నేతలు తమ వంతు పోరాటం చేస్తున్నారు. అయితే ఇది సరిపోవట్లేదని పార్టీ హైకమాండ్ భావిస్తోందో ఏమో.. నేరుగా పార్టీ పెద్దలే రంగంలోకి దిగబోతున్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి



అమిత్ షా తదితరులు రాబోయే రెండు నెలల్లో రాష్ట్రంలో పర్యటించబోతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కొంత మేర డీలా పడింది. ఆ పార్టీకి అంతర్గత సమస్యలూ చుట్టుముట్టాయి. ప్రధాన ప్రతిపక్షంగా దూకుడు ప్రదర్శించాల్సిన గులాబీ పార్టీ ఆశించిన స్థాయిలో ప్రజా సమస్యలపై పోరాడలేకపోతుందనే విమర్శలు ఉన్నాయి. ఈ శూన్యతను ఆసరాగా చేసుకుని, కాంగ్రెస్‌కు ఏకైక బలమైన ప్రత్యామ్నాయం తామేనని నిరూపించుకోవాలని బీజేపీ హైకమాండ్ గట్టిగా భావిస్తోంది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, దాన్ని క్యాష్ చేసుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, విద్యుత్ రంగ సవాళ్లు, రైతు రుణమాఫీ అమలులో సాంకేతిక లోపాలు, ఆరు గ్యారెంటీల అమలు తీరును బీజేపీ తీవ్రంగా ఎండగడుతోంది. కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా, ఈ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తోంది. ఎన్నికల వరకూ వేచి చూడకుండా, రెండేళ్ల ముందే కేడర్‌ను సమరశంఖానికి సిద్ధం చేయడం ద్వారా ప్రత్యర్థి పార్టీలను ఆత్మరక్షణలోకి నెట్టాలనేది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది.నవంబర్‌లో హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలో పర్యటించబోతున్నారు. ఆయన పూర్తిగా సంస్థాగత ప్రక్షాళనపైనే దృష్టి పెడతారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. బూత్ స్థాయి కమిటీల పనితీరు, నాయకుల మధ్య సమన్వయం, సోషల్ మీడియా నెట్‌వర్క్ పటిష్టతపై ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీలో అసమ్మతికి తావులేకుండా, క్షేత్రస్థాయిలో కష్టపడే సాధారణ కార్యకర్తలకు పెద్దపీట వేసేలా ఆయన నేరుగా బూత్ స్థాయి సైనికులకు మార్గదర్శనం చేయనున్నారు. పార్టీ క్యాడర్‌లో జోష్ నింపడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.డిసెంబర్‌లో జరగనున్న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన రాజకీయంగా అత్యంత కీలకం కానుంది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మంజూరు చేసిన జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల తదితర అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారానే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం, కేంద్ర నిధుల వినియోగంపై స్పష్టతనివ్వడం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని నెలకొల్పేందుకు ప్రయత్నిస్తోంది.తెలంగాణలో ఎవరితోనూ పొత్తులు లేకుండా, భవిష్యత్తులో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అనే ముఖాముఖి పోరును సృష్టించడమే బీజేపీ అసలు లక్ష్యంగా ఉంది. బీఆర్ఎస్‌కు ఓటేస్తే కాంగ్రెస్‌కే మేలు జరుగుతుందనే ప్రచారాన్ని ప్రజల మెదళ్లలో నాటడం ద్వారా ఓట్ల చీలికను నివారించవచ్చని భావిస్తున్నారు. ఏదేమైనా ఢిల్లీ అగ్రనేతల వరుస పర్యటనలతో తెలంగాణ రాజకీయాలు వేడెక్కబోతున్నాయి.

డ్రగ్స్ మాఫియాపై కేంద్రం సర్జికల్ స్ట్రైక్..

బెంగళూరు, డ్రగ్స్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ ట్రైడెంట్'లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకుని కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఈశాన్య రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా భారీ ఆపరేషన్ నిర్వహించారు. మణిపూర్, అసోం, మిజోరం రాష్ట్రాల్లోని 38 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టి 18 మంది అనుమానిత స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ చర్యల్లో భాగంగా సుమారు రూ.100 కోట్ల హవాలా లావాదేవీలకు సంబంధించిన వివరాలను గుర్తించడంతో పాటు 1,424 బ్యాంకు ఖాతాలను సీజ్ చేసినట్లు వెల్లడైంది.భారత్-మయన్మార్-బంగ్లాదేశ్ సరిహద్దుల మీదుగా సాగుతున్నట్లు భావిస్తున్న అంతర్జాతీయ డ్రగ్స్ అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈశాన్య రాష్ట్రాల్లోని సున్నితమైన ప్రాంతాల్లో సమన్వయంతో తనిఖీలు, దాడులు నిర్వహించారు. మాదకద్రవ్యాల సరఫరా మార్గాలను గుర్తించడం, వాటి వెనుక ఉన్న వ్యక్తులను పట్టుకోవడం, అక్రమ లావాదేవీలను వెలికితీయడం ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.ఈ దాడుల్లో 18 మంది అనుమానితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కీలక ఆధారాలను అధికారులు సేకరించినట్లు సమాచారం. సీజ్ చేసిన బ్యాంకు ఖాతాల ద్వారా డ్రగ్స్ వ్యాపారానికి సంబంధించిన ఆర్థిక మూలాలను గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.డ్రగ్స్ అక్రమ రవాణా వెనుక భారీ స్థాయిలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. సుమారు రూ.100 కోట్ల విలువైన హవాలా లావాదేవీలకు సంబంధించిన వివరాలు వెలుగులోకి రావడం ఈ కేసులో కీలకంగా మారింది. దీంతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న 1,424 బ్యాంకు ఖాతాలను అధికారులు సీజ్ చేసినట్లు వెల్లడైంది.ఈ లావాదేవీల వెనుక ఎవరున్నారు? డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చిన డబ్బును ఏయే మార్గాల్లో తరలించారు? ఈ నెట్‌వర్క్‌కు ఇతర ప్రాంతాల్లోనూ సంబంధాలున్నాయా? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగనుంది. ఆర్థిక లావాదేవీలను విశ్లేషించడం ద్వారా ఈ అక్రమ వ్యాపారానికి సంబంధించిన మరిన్ని వివరాలు బయటపడే అవకాశం ఉంది.ఈ ఆపరేషన్‌లో 500 డిటొనేటర్లను స్వాధీనం చేసుకున్నట్లు వచ్చిన సమాచారం మరింత ఆందోళన



కలిగిస్తోంది. డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో డిటొనేటర్లు బయటపడటంతో వాటి నిల్వ, రవాణా వెనుక ఉన్న ఉద్దేశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వీటిని ఏ కార్యకలాపాల కోసం వినియోగించాలనుకున్నారు? డ్రగ్స్ నెట్‌వర్క్‌తో వాటికి ఉన్న సంబంధం ఏమిటి? అనే అంశాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పాటు మాదకద్రవ్యాల సరఫరా వ్యవస్థకు ఆర్థికంగా, లాజిస్టిక్స్ పరంగా సహకరిస్తున్న నెట్‌వర్క్‌లను గుర్తించడం భద్రతా సంస్థలకు కీలకంగా మారింది.దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా అంతర్జాతీయ సరిహద్దుల గుండా జరిగే అక్రమ రవాణా, హవాలా లావాదేవీలు, డ్రగ్స్ పంపిణీ వ్యవస్థలపై నిఘా పెంచుతోంది. 'ఆపరేషన్ ట్రైడెంట్'లో భాగంగా చేపట్టిన దాడులు ఈ ప్రయత్నాల్లో కీలక పరిణామంగా నిలిచాయి.2029 డిసెంబర్ 31 నాటికి దేశంలో డ్రగ్స్ అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నట్లు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆపరేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనలు, స్వాధీనం చేసుకున్న వస్తువుల పూర్తి వివరాలు, అరెస్టయిన వారి పాత్రపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.డ్రగ్స్ సరఫరా మార్గాలను ధ్వంసం చేయడం, అక్రమంగా సంపాదించిన సొమ్మును గుర్తించడం, అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ఛేదించడం ద్వారా మాదకద్రవ్యాల వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని భద్రతా సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

జగన్ ట్రాప్ లో టీడీపీ...



నెల్లూరు, ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల వేళ జగన్ ట్రాప్ లో టీడీపీ పడినట్లే కనిపిస్తుంది. జాతీయ స్థాయిలో నామినేషన్ల కేంద్రాల వద్ద జరిగిన చర్చనీయాంశమైంది. జాతీయ మీడియాతో పాటు సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెర్స్ కూడా ఈ ఘటనపై టీడీపీకి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. ఎన్డీఏ కూటమిలో టీడీపీ ఉండటంతో జాతీయ స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలు, నామినేషన్ల చించివేత ఘటనలు నేషనల్ లెవెల్ లో హైలెట్ గా నిలిచాయని చెప్పాలి. జగన్ కోరుకున్నదిదే. జగన్ అనుకున్నదిదే. అందుకే జగన్ తన అభ్యర్థులను బరిలోకి దింపాలని పార్టీ నేతలకు తెలిపారు. ఈ ఘటనలతో టీడీపీతో పాటు కూటమిలో ఉన్న బీజేపీ వైపు కూడా కొందరు దోషిగా చూడటం మొదలు పెట్టారు. ఇది జగన్ కు ప్లస్ కాగా, టీడీపీకి మైనస్ గా మారింది. బీజేపీ కేంద్ర నాయకత్వం కూడా ఈ ఘటనలతో కొంత ఆలోచనలో పడినట్లు చెబుతున్నారు. జగన్ వేసిన ట్రాప్ లు సునాయాసంగా టీడీపీ పడిపోయిందన్న రాజకీయ విశ్లేషణలు వెలువడుతున్నాయి స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల పర్వంలో చోటుచేసుకున్న ఘర్షణలు, రాజకీయ వ్యూహాల వల్ల ప్రస్తుతం ఈ అంశం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. జగన్ మోహన్ రెడ్డి వ్యూహాత్మకంగా వేసిన ట్రాప్‌లో టీడీపీ పడిందా లేదా అనేది రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు వైసీపీ నేతలను ముందస్తు అరెస్ట్ లు చేయడం, నామినేషన్ల కేంద్రాల్లోకి చొరబడి ప్రత్యర్థుల నామినేషన్ పత్రాలను చింపివేయడం, వాహనాల దగ్ధం, పోలీసు కాల్పులు, రాళ్ల దాడులు వంటివి జాతీయ స్థాయిలో హైలెట్ అయ్యాయి. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో తమ అభ్యర్థులపై దాడులు జరుగుతున్నాయని, గడువు పొడిగించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ఇందులో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని భావించి, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించడంతో ఈ వ్యవహారం జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించింది. ఆంధ్రప్రదేశ్ లో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, కేంద్ర బలగాలను రంగంలోకి దించాలని లేదా రాష్ట్రపతి పాలన విధించాలని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ స్థాయిలో డిమాండ్ చేయడం వల్ల ఈ రగడ నేషనల్ ఫోకస్ అయింది. పుంగనూరు, కడప వంటి ప్రాంతాల్లో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, అవినాష్ రెడ్డి కాన్వాయ్‌లపై దాడులు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ ఎంపీలు రాష్ట్రపతికి, లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదులు చేశారు. అంతే కాదు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేసేందుకు వస్తున్న మహిళలను అడ్డుకోవడం, వారిపై దాడులు చేయడం కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటుండటంతో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో హైలెట్ అయింది. ఏపీలో ఎప్పుడూ లేనిది ఇలా జరుగుతుందేమిటంటూ కొందరు ఆరా తీస్తున్నారు. తప్పు ఎవరిది? ఎవరు ఎవరిపై దాడులు చేశారన్నది పక్కన పెడితే అధికారంలో ఉన్నది మాత్రం టీడీపీనే. అందుకే ఖచ్చితంగా శాంతిభద్రతల సమస్య అనేది ప్రభుత్వం మెడకు చుట్టుకునే ప్రమాదం ఉందని చెబుతున్నారు. జగన్ ఇంత దూరం ఆలోచించి తన అభ్యర్థులను బరిలోకి దింపారా? లేదా? అన్నది తెలియదు కానీ, జగన్ ట్రాప్ లో మాత్రం టీడీపీ పడినట్లేనని చాలా మంది భావిస్తున్నారు.

కొండాపూర్‌లో ఎండీఎంఏ ముఠా గుట్టురట్టు

కొండాపూర్:కొండాపూర్‌లో మత్తు పదార్థం ఎండీఎంఏ విక్రయిస్తున్న ఫొటోగ్రాఫర్ ఆకుల సాయిరామ్‌ను ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు పట్టుకున్నారు. 4.45 గ్రాముల ఎండీఎంఏ, కారు, తూకం యంత్రం, రెండు ఖరీదైన ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రూ.25 వేలకు మత్తు పదార్థాన్ని కొనుగోలు చేసి, గ్రాము రూ.10 వేల చొప్పున విక్రయిస్తున్నట్లు గుర్తించారు.

నీటి ఎద్దడి ఆరంభం...బాసర ఐఐటీలో ఆన్ లైన్ క్లాసులు



అదిలాబాద్, బాసర ట్రిపుల్ ఐటీలో అక్టోబర్ నెలలోనే నీటి ఎద్దడి సమస్య తీవ్రమైంది. గోదావరి నుంచి నీటిని తోడి పంప్ చేసే మోటార్లు మొరాయించడంతో క్యాంపస్‌లో నీటి సమస్య తలెత్తింది. దీంతో దసరా సెలవులకు వెళ్లిన విద్యార్థులు ఇళ్ల వద్దే ఉండాలని ట్రిపుల్ ఐటీ యాజమాన్యం ఆదేశించింది. వీరికి ఆన్‌లైన్ విధానంలో క్లాసులు బోధించాలని నిర్ణయించింది. అయితే పీయూసీ చదివే విద్యార్థులు నవంబర్ 10లోగా క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. మిగతా విద్యార్థులు నవంబర్ 18న రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు దసరా సెలవులను పొడిగించారు. ఎల్‌నినో ప్రభావం, గోదావరిలో ఏర్పాటు చేసిన మోటార్లు మొరాయించడంతో తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో ఆన్‌లైన్లో క్లాసులు నిర్వహించాలని ట్రిపుల్‌ఐటీ యాజమాన్యం నిర్ణయించింది. సోమవారం నుంచి ఆన్‌లైన్లో క్లాసులు మొదలుపెట్టి.. నవంబర్ 17 నాటికి సిలబస్ పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం ఒక ప్రకటన జారీ చేసింది.పీయూసీ 1, పీయూసీ 2 చదువుతున్న విద్యార్థులు నవంబర్ 10వ తేదీలోగా క్యాంపస్‌లో రిపోర్టు చేయాలని.. వీరికి ఈ నెల 18వ తేదీ దాకా తరగతులు నిర్వహించినట్లు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం తెలిపింది. ఇక ఇంజినీరింగ్ చదివే వారి విషయానికి వస్తే.. ఈ1 నుంచి ఈ4 దాకా విద్యార్థులంతా నవంబర్ 18న క్యాంపస్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. వీరికి మిడ్ టర్మ్, సెమిస్టర్ పరీక్షలను ఎప్పటిలాగే ఫిజికల్ మోడ్‌లో నిర్వహించనున్నారు. ట్రిపుల్ ఐటీలో చదివే విద్యార్థులందరికీ మిడ్ టర్మ్ పరీక్షలు నవంబర్ 19-21 తేదీల మధ్య జరుగుతాయి. ఈ పరీక్షలను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు.బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో దాదాపు 9 వేల మంది విద్యార్థులు ఉంటున్నారు. వారి రోజువారీ అవసరాల కోసం గోదావరి నదిలో ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన ఇన్‌టేక్ వెల్ నుంచి భారీ పంపులు, మోటార్లను ఉపయోగించి నీటిని తోడుతారు. రోజుకు 20 లక్షల లీటర్లకుపైగా నీటిని గోదావరి నుంచి లిఫ్ట్ చేసి క్యాంపస్‌కు తరలిస్తారు. గోదావరి నుంచి లిఫ్ట్ చేసిన నీటిని క్యాంపస్‌లోని రిజర్వాయర్ లేదా సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లో నిల్వ చేస్తారు. అయితే గోదావరి నీళ్లను తోడే పంప్‌హౌస్ మోటార్లు మొరాయించడంతోపాటు.. స్టోరేజీ చెరువులో నీరు లేకపోవడంతో క్యాంపస్‌లో అక్టోబర్ నాటికే నీటి ఎద్దడి తీవ్రమైంది. ఈ నేపథ్యంలోనే ట్రిపుల్ ఐటీ యాజమాన్యం దసరా సెలవులను పొడిగించి, సిలబస్‌పై ప్రభావం పడకుండా చూడటం కోసం విద్యార్థులకు ఆన్‌లైన్లో క్లాస్‌లు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది.కాగా బాసర ట్రిపుల్ ఐటీలో మౌలిక వసతులను మెరుగుపర్చడం కోసం తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే రూ.5 కోట్లు మంజూరు చేసింది. విద్